

కంచె
చేను మేసిందట
మంచె
మంచి నిద్రలో ఉందన్నమాట

-సోమేపల్లి వెంకటసుబ్బయ్య
9000004565

### ఘంటారావం

మేధస్సు
ధనుస్సు
మనస్సు
సరస్సు.
దేవుడి పేరు పెడితే
దివ్యజ్ఞానమొస్తుందా?
సంస్కారం లోపిస్తే
సత్కీర్తి లభిస్తుందా?

నేటి వనిత
నిత్యనూతన సరిత
అవిశ్రాంత ఘనతల
అలను పోలిన చరిత.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



# పాటే వారి చిరునామా.... వేములపల్లి శ్రీకృష్ణ



నేటి మేటిపాట

ఆ పాట పల్లవి ఒక్కటే చాలు తెలుగు తేజాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడానికి చేరవేయడానికి. ప్రతి చరణమూ తెలుగువాని పౌరుష ప్రాభవాన్ని వెలుగెత్తి చాటుతున్నది. ఇందులోని ప్రతి పదమూ మన వీరవనితల పోరాట పటిమకు హారతులర్పిస్తున్నది. ప్రతి అక్షరం మన గోదావరి, క్రిష్ణ, తుంగభద్రా నదీ జలనిక్షేపాల వెల్లువలను శ్లాఘిస్తూ ధాన్యపురాశులను ఆస్వాదింపజేస్తున్నది. ప్రతి వాక్యమూ తెలుగువాడి సంఘీభావాన్ని అర్థిస్తూ కుల కుతంత్రాలకతీతంగా కలిసిరమ్మని ప్రేరేపిస్తున్నది. ఆ పాట ఏ అవార్డుకు అందనంత ఎత్తుకు ఎదిగి నేటికీ తెలుగువాని మనస్సును ఉర్రూతలూగిస్తున్నదనటము ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఇంతకూ ఈ పాట రచయిత ఎవరో కాదు ,.... ప్రముఖ కమ్యూనిస్టుయోధుడు, శాసన సభ్యుడు, సంఘ సంస్కర్త 'వేములపల్లి. శ్రీ క్రిష్ణ.' ఆ పాట.... ' చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా-- గతమెంతో ఘనకీర్తి గలవోడా. "రచయిత ఎంత ప్రతిభావంతుడైనా, ఎంతటి సేవాదురంధరుడైనా ఈ పాటే 'వేములపల్లి' చిరునామాను జన సామాన్యానికి అందించింది. వేములపల్లి శ్రీ కృష్ణ 1917లో గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని బేతపూడి గ్రామంలో జన్మించారు. తన ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం రేపల్లెలోను, గుంటూరు ఎ. సి. కళాశాలలో డిగ్రీ ని పూర్తి చేశారు. వీరు 1968 నుండి 1972 వరకు ప్రముఖ దినపత్రిక ' విశాలాంధ్ర' లో సంపాదకులుగా పనిచేసి ఎందరో మేధావుల మన్ననలు పొందాడు. 1938 లోనే పులుపుల వెంకట శివయ్య అనే నాయకుని ప్రోత్సాహంతో కమ్యూనిస్టుపార్టీ లో చేరి భవిష్య కాలంలో మూడు సార్లు శాసన సభ్యుడుగా ( 1952, 1962, 1972) ఎన్నికైనారు. ఆ రోజుల్లో విశాఖ ఉక్కు కార్మికుల ఉద్యమములో ప్రజలపక్షం వహించి తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన నిస్వార్థపరుడు వేములపల్లి శ్రీకృష్ణ. నిబద్ధత వారి జీవనశైలి, ధైర్యం వారికి పుట్టుకతో వచ్చిన నైజం కొంతకాలం కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్‌లో పనిచేస్తూ 8 వ తేది ఏప్రెల్ నెల 2000 నాడు పరమపదించారు. మరణానంతరం కూడా తన నేత్రాలు వేరొకరికి చూపునివ్వాలనే కాంక్షతో యల్.వి. ప్రసాద్ ఐ బ్యాంకు కు డొనేట్ చేసిన మానవతా మూర్తి వేములపల్లి వారు. ఐఐ వారి పాటలోని పల్లవి చరణాలను ఒక్కసారి ప్రతి తెలుగు వాడు స్మరించుకోవాల్సిన అవసరముంది. ఈ పాట 1952 లో నిర్మించిన 'పల్లెటూరు' చిత్రం లో ఉపయోగించారు..

**చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా**
**గతమెంతో ఘన కీర్తి గలవోడా.**

**వీర రక్తపు ధార--దారబోసిన సీమ**
**పలనాడు నీదెరా వెలనాడు నీదెరా**

**బాలచంద్రుడు చూడ ఎవరోయి**
**తాండ్ర పాపయ్య.గూడ నీవోడోయ్.**

**నాయకీ నాగమ్మ మల్లమాంబా మొల్ల**
**మగువ మాంచాల నీ తోడబుట్టినవోళ్ళే**
**వీర వనితల గన్న తల్లేరా**
**వీరమాతల జన్మభూమేరా**

**కల్లోల గౌతమి వెల్లువల క్రిష్ణమ్మ**
**తుఃగభద్ర తల్లి పొంగివారిన చాలు .**
**ధాన్య రాశులె పండు దేశాన**
**కూడు గుడ్డకు కొదవలేదోయి.**

**ముక్కోటి .బలగమోయ్**
**ఒక్కటై మనముంటె**
**ఇరుగు పొరుగు లోన ఊరుపేరుంటాది.**

**తల్లి ఒక్కతే నీకు తెలుగోడా**
**సవతి బిడ్డల పోరు మనకేలా**

**పెనుగాలి వీచింది అణగారి పోయింది**
**నట్టినడి సంద్రాన నావ నిలిచుండాది**

**చుక్కాని బట్టరా తెలుగోడా**
**నావ దరిచేర్చరా మొనగాడా.**
**!! చెయ్యెత్తి!!**

పాటకు సాహిత్యమే పట్టుగొమ్మ. అదే సామాన్యుల వద్దకు చేర్చే వారధి. అలాంటి పాటలు కోటికొక్కటున్నా శ్రోతల హృదయాలలో శాశ్వత స్థానాన్ని పొందుతాయి. ఆ కోవకు చెందినవే నేటికీ జీవించి వున్నాయి. 'గతమెంతో ఘనకీర్తి గలవోడా' అన్నారు కవి ఈ పాటలో.



- మాయకుంట్ల
నారాయణ రెడ్డి
9989686603

# నీవు సల్లగుండాలె



(వచన కథా కావ్యం-12)

మృత్యువు - చేతన
చైతన్యం - సుషుప్తి
సుషుప్తి - నిద్ర
నిద్ర - స్వప్నం
స్వప్నం - జాగృతి
జాగృతి - నిస్తేజం...
ఈ ద్వైవీ భావనకు నడుమ
గుట గుట లాడే పరిస్థితి
అప్పుడప్పుడు మనిషిని తడుముతూ ఉంటుంది
ఈ సంధిగ్ధావస్థలో మనిషి
జీవచ్ఛవంగా మారిపోతుంటాడు

సరయుకు ఆ పరిస్థితి దాపురించింది
ఇది తొలిసారి కాదు కానీ
ఇంతటి విఘాతం ఇంతకుముందు తగలలేదు.

భర్త మరణశయ్య మీద లేదు!
ఇది ఆనందం!
నలుగురిలా బతికే పరిస్థితి గాదు!
ఇది దుఃఖం!
ఒకటి రెండు వారాల్లో కుదుటపడతాడు
అయినా
మామూలు మనిషి కాలేడు... ఎప్పటికీ!

విధి పరిహాసం
కాలం కాఠిన్యం
కర్మఫలం...
ఇవన్నీ ఆత్మ తృప్తి నాటకంలో
అరిగిన డైలాగులు.
కారుతున్న కన్నీరు
అలసి ఆగిపోయింది
సంక నున్న కన్నపేగు
పాల కోసం ప్రాణం తీస్తున్నది

కాళ్లు రెండూ కోల్పోయిన దర్శనం శరీరం
ప్రశ్నల శరాలతో ఆమెకు
గాయాలను చేస్తున్నది.

దుఃఖమే తోడుగా
నిశ్శబ్దం కారు చీకటిలో
మొద్దుబారి పోయిన ఆమె చెవులకు
పరిచితమైన అడుగుల సవ్వడి వినిపించింది

పటేలు!
దర్శనం బతుకనీకె బాటపరిచినోడు!
ఇప్పుడీ అంపశయ్య నెక్కనీకె దారి చూపినోడు!
వీడు మేలు జేసినోడా
కీడు జేసినోడా
దండం పెట్టాలెనా? దండ పట్టుకోవాలెనా?
సంశయం కుడితిలో
విలవిలలాడుతున్న సరయుకు...
అతడే దండం బెట్టిండు.

'బతికున్న నీ మొగనికి
బతకవలసిన నీకు, నీ బిడ్డకు
నేను తోడుగా ఉంటా'నని భరోసా యిస్తున్నడు.

నమ్మకం - అపనమ్మకం
ఆశ - అనుమానం నడుమ కొట్టుకుంటూ
ఆ క్షణానికి అతన్ని చూసి
'నీవు సల్లగుండాలె!'
అనుకున్నది సరయు...



-దోరవేటి
సెల్:9866251679

# శ్రమజీవులే దేశ నిర్మాతలు




-డాక్టర్ కత్తి పద్మారావు.
9849741695.

సమాజం ఎంత
ఘర్షితమవుతున్నా
కాశ్మీరంలో ఆ యాపిల్
సౌందర్యం తరగలేదు
నిరంతరం రాలుతున్న
నెత్తుటి బొట్లు
వాటిని అంటలేదు
నిజమే! ఆ కేరళలోని
చిన్ని చిన్ని సరస్సుల్లో
పడవ ప్రయాణాల్లో
నీటి బుగ్గల సవ్వడులు
ఆ గొర్రెను చూసినప్పుడు
దాని ఉన్ని మనల్ని
రక్షిస్తుందని తెలియదు కదా !
చిన్ని చిన్ని చిదుగుల నుండి
వచ్చే చలిమంట మనలో
వేడి సెగలను పుట్టిస్తుంది
అవును!
చారిత్రక కట్టడాలన్నీ
శిల్పుల చేతి రంధ్రాల నుండి
రూపొందినవే
శిల్పి అమరుడయ్యాడు
శిల్పం చరిత్రకు
గుర్తుగా నిలబడింది
ఎన్నో ఖండాల నుండి
మన దేశం శిల్ప కళను
ఆహ్వానించింది
మన శిల్పులు
అట్టడుగు లోయల నుండి
ఆవిర్భవించిన వారే
ఆ గుహల్లో చెక్కబడిన
బుద్ధుని విగ్రహాన్ని
చెక్కిన శిల్పి ఓ దళితుడే
అతని వేళ్ళు
ఈ దేశ పురాతత్వానికి
ఆయువులు పోశాయి.
ఆ యువతీ యువకులు
హృదయ శిల్పాన్ని
ఆవిష్కరిస్తున్నారు
ఎవరో వారి వేళ్ళు
నరుకుతున్న శబ్దాలు
వారి మనస్సు మలినం లేనిది
ప్రేమకు అంతరాలు లేవు
దాని అంతరంగ సంగీతం
ఒక విశ్వజనీన గీతం
ఆ ప్రేమికులు కులం కోటలు
కూలుస్తున్నారు
ప్రేమ వనాలు నాటుతున్నారు
ఒక్క ఆకు కదలికకు కూడా
వారు స్పందిస్తున్నారు
ప్రతి అంతరంగానికి
ఒక భాష ఉంది
ప్రతి ఊనికకూ
ఒక చలనం ఉంది
ప్రతి చలనానికి
ఒక శృతి ఉంది
ప్రతి శృతిలో
ఒక సంవేదన ఉంది
ప్రతి సంవేదనలో
ఒక ఘర్షణ ఉంది
ప్రతి ఘర్షణా
మార్పుకు మూలమే
విశ్వాన్ని కదిలించే భావాలన్నీ
నిరాపేక్షమైనవే
ఆ కొండ చరియల మీద
గొర్రెలు మేపుతున్న పడతి
కనుసైగల్లో అవి నడుస్తున్నాయి
ఆమె సుదీర్ఘ ప్రయాణంలో కూడా
అలసిపోవడం లేదు
ప్రతి అడుగులో కొండలు, చెట్లు
తనకు పాఠాలు నేర్పుతున్నాయి
ప్రకృతిలో వినిపిస్తున్న
నూతన స్వరాలు,
రంగురంగుల మార్పులు
ఆమెను ఉత్తేజ పరుస్తున్నాయి
ఆమెతో సూర్యుడు మాట్లాడుతున్నాడు
అస్తమయం మాట్లాడుతుంది
అంతఃపురంలోని యువతి
కుక్కల అరుపుల మధ్య
పెరుగుతుంది
ఇతరుల వెంటపడి కరిచే వేటను
ఆమె చూస్తూ నవ్వుతుంది
ప్రకృతి కరువైన చోట
శిశువు శబ్దం వినపడని చోట
వృద్ధులకు నివాసం లేని చోటుల్లో
ఆనందం ఏమి ఉంది?
అది గృహమే కాదు
ద్వైదీకృత వివాద
వేదిక అవుతుంది
నిజమే! ఆ నేత నేసే
యువతి ముందటి మగ్గంలో
మొదట అవి దారాలే
గంటలు గడిచే కొలదీ
అది ఒక కళాత్మకమైన
వస్త్రంగా మారుతుంది
ఆ పోచంపల్లి, ఉప్పాడలో
ఆ పడతుల వేళ్ళు
ఎంత కళాత్మక ఆహార్యాన్ని
సృజించాయో!
నేత కళలో ఎంతో
నైపుణ్యం దాగుంది!
అసలు కళ అంటేనే
ప్రేమ ధుని
ఏ పుణ్యక్షేత్రానికీ లేని పేరు
కంచికి ఎందుకు వచ్చింది?
అక్కడ మగ్గం
దేశమంతా ఎన్ని
వస్త్రశాలలను సృష్టించింది?
స్త్రీ అంతర్గతంగా
బహిర్గతంగా
ఈ దేశాన్ని నిరంతరం
సృజిస్తూనే వెళుతుంది
రాజ్యం పితృస్వామ్యంగా ఉంది
ధనస్వామ్యంగా ఉంది
కళకు - సృజనకు - శ్రమకు -
శ్రమజీవికి ఊతం లేదు.
ఎవరిని రాజ్యం గుర్తిస్తుంది?
రాళ్ల దగ్గర
నాలుగు మంత్రాలు వల్లించి
అనృతాలను, అభూత
కల్పనలను చెప్పి బతుకుతున్న
విభూతి స్వాములనా ?!
ఆ నాట్లు వేసే స్త్రీ,
ఆ నేత నేసే స్త్రీ,
ఆ గొర్రెలు కాసే స్త్రీ,
ఆ చేపలు పట్టే స్త్రీ,
ఆ బట్టలు ఉతికే స్త్రీ
నిజమైన దేశ నిర్మాతలు
వారు ఏది సృష్టిస్తున్నారో
దాన్ని అనుభవించుట లేదు కదా!
నిషేధితమైనది అంతా
నేడు ఔషధమే అవుతుంది
శ్రమజీవులే దేశ నిర్మాతలు
శ్రమ నుండే జ్ఞానం పుడుతుంది
ఉత్పత్తి శక్తులే జీవన పతాకలు

పుస్తక సమీక్ష

# ఉత్తరాంధ్ర యాస భాష కథలు




కప్పస్తంభం కథా సంపుటి రచయిత శ్రీ చింతకింది శ్రీనివాస రావు 25 ఏళ్ళ ప్రాయం నుంచే రచనా వ్యాసంగం చేపట్టారు. దాలప్ప తీర్థం, కాన్పులదిబ్బ ఉడుకుబెల్లం వీరి ఇతర కథా సంపుటాలు. వికర్ణ, అది గోరక, ఔటర్ హార్బర్, ఋగతల కాలం నాటి చుక్క పల్లి, పూలగండు వనం నవలలు. వీరి లేటెస్ట్ నవల మున్నేటి గీతలు ఈ మధ్యే తానా నవలల పోటీ 2022లో ప్రథమ బహుమతి లక్ష రూపాయల పురస్కారం గెలుకుంది. శ్రీనివాసరావు మంచి నాటక రచయిత కూడా! చాసో పురస్కారం కొలకలూరి నవలా పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది ఉగాది పురస్కారం గెలుచుకున్న వీరు ఉత్తరాంధ్ర మాం దలికంలో ఎక్కువగా రాస్తారు. ప్రస్తుత కథల సంపుటిలో పది కథలున్నాయి. మీరు పదేనా? అనుకోవచ్చు. కాని ఇవి మూస కథలు కావు. రసిక జనం మెచ్చే 'మాస్' కథలు. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే చేవ ఉన్న కథలు.

కథ, కథనం రెండూ బండికి కట్టిన జోడెద్దుల్లాంటివి. రెండూ బావుంటేనే, కథ పండుతుంది. ఈ జోడెద్దుల బండి నడిపే వారు సిద్ధహస్తులైతే, పాఠకుల నాడి తెలిసిన వాడైతే కథ మరింత పండుతుంది. జనం నీరాజనాలందు కుంటుంది. ముందుగా టైటిల్ కథలోకి వద్దాం. సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నెరుగని ఆంధ్ర ఒరియాభక్తుడు ఉండడు. అక్కడో స్తంభాన్ని కప్పస్తంభం అంటారు. ప్రహ్లాదస్తంభం అని కూడా అంటారు. సింహాద్రి అప్పన్నకెంత పలుకుబడి ఉందో ఈ స్తంభానికి అంత పలుకుబడి ఉంది. అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తుడు తప్పకుండా ఈ స్తంభానికి బట్టతో బంధించుకుని కోరిన కోర్కె తప్పక నెరవేరుతుందన్న విశ్వాసం. అలాంటి స్తంభం మాయమవుతుంది. అర్చకులు శఠగోపులవారు పడిన వేదన, మాయమైన కప్పస్తంభం వేదన. ఇతివృత్తం. చివరకు ఆ స్తంభం తిరిగి యధాస్థానంలో కనబడటం సుఖాంత కథనం. ఈ సందర్భంగా చింతకింది వారి వర్ణన చిత్తగించండి.

"మెల్లగా తెల్లారింది. విషయమంతా ఆ నోటా ఈ నోటా అడవివరం పాకిపోయింది. గోపాలపట్నంలో తెలిసిపోయింది. పెందుర్తి చేరిపోయింది. చోడారం మాడుగుల పాడేరు దాటేసింది. విశాఖ నగరమంతా అల్లేసింది. ఉత్తరాంధ్ర ముట్టుకుపోయింది. ఒరిస్సా అంటుకు పోయింది. హైదరాబాద్ అగ్గయిపోయింది. (పే.60,61) రావుగారి వెంటే మనం కూడా పోతూ చివరాకరికి హైదరాబాద్ చేరినట్లనిపించటం లేదూ- అదీ చింతకింది శ్రీనివాస రావుగారి కథా శిల్పం! పత్రికా విలేకరి భక్తులు తామెవరిని, ఏరాయిని కౌగిలించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నిలదీస్తే మహిళా సిబ్బంది ఎందుకైనా మంచిదని దూరం జరిగి కొంగులు కప్పుకున్నారట! సున్నితమైన హాస్యం కితకితలు పెడుతోంది కదూ!

అక్కడక్కడ మనం తెల్ల తోలున్న వారిని చూస్తాం. "వాడు పాతూరోడి లా లేడు. తెలుగువాడిలా లేనే లేడు. భారతీయుడిలా అస్సలు లేడు. మరెలా ఉన్నాడు? నెంబర్ వన్ స్టీమర్ సరకులాగున్నాడు. ఫస్టు రకం ఫారినోళ్ళాగున్నాడు." చెరువుకు గండిపడితే అడ్డంగా ద్వారబంధాన్ని నిలిపి గండి పూడుస్తాడు. ఆ 'లండనోడు!'. చెప్పటం సులువే కాని రచయిత లండనోడ్ని మన కళ్ళెదుట అక్షరాల్లోనే బొమ్మ కట్టించారు.

మరో కథ బుక్కా వీధి నాగ రత్నమ్మ. 'టక్కులాడి తాషామరపా'. 'సాన్ది' అని అందరూ అసయ్యించుకున్నా, ఈ కథ చెప్పే కుర్రాడికెందుకో ప్రేమ. నాగరత్నానికీ అంతే! చివరకీ కుర్రాడు నాగరత్నమ్మ పాడెకు భుజా న్నేసి 'నాయనమ్మ' ఋణం తీర్చుకుంటాడు. చివరికి గాని కారణం తెలియని కొస మెరుపు కథ "బుక్కా వీధి". అలంకరణతో అమ్మవారి విగ్రహానికి అందం తెచ్చినట్లు కథలన్నింటా తన వర్ణనతో అందం చేకూర్చారు రచయిత. మళ్ళీ మళ్ళీ చదువుకుని మురిసిపోయే కథలివి!

**ప్రతులకు:** శ్రీనిజ ప్రచురణలు
6-60/1, రవీంద్రనగర్
పాత డైరీ ఫార్మ్
విశాఖపట్నం-530 040
ఆంధ్రప్రదేశ్
సెల్: 8897147067



- కూర చిదంబరం
సెల్: 8639338675

# వసంత యామిని

"ఒకానొక సాయం సంధ్య వేళ
గమ్యం తెలియని తెరువరిలా అడుగులు వేస్తున్నా
దేహం ముందుకు కదులుతోంది భారంగా
మనస్సుకి మాత్రం ఏదో తెలియని అలజడి
జ్ఞానేంద్రియాల్లోకి చొచ్చుకు వెళుతున్న
లోకపు వింతపోకడలు
గుండెను మెలితిప్పుతున్న జ్ఞాన నరాలు
ఎల్లెడలా అసూయా ద్వేషం
జంట కవుల్లా విజృంభిస్తున్నాయి
కామక్రోధాలు రాబందుల జతలా
ఆడదేహాలను ఛిద్రం చేస్తున్నాయి
దౌర్జన్యం రాక్షసనీడలా కమ్ముకుంటోంది
నిరాశ నివురుగప్పిన నిప్పులా మండుతోంది
తామరాకుమీద నీటిబొట్టునవడం ఎలా..?
మనసుకు ఏది అంటకుండా
శాంతి లేని మనసులు విశ్రాంతి లేని మనుషులు
అందని ఆశలవెంట పరుగులు
తీరని కోర్కెల గుర్రాల పందాలు
మూకుమ్మడిగా మనసుమీద దాడిచేస్తున్నాయి
భాధాతప్త హృదితో నడుస్తూ ఉన్నాను
ఏ చోటినుంచో వీస్తున్న
చిరు తెమ్మెర మోముని ముద్దాడింది
హఠాత్తుగా నడక ఆపి నిలిచి చూసాను
సాలెపురుగు ఒకటి దీక్షగా అల్లుతోంది చెదిరిన గూడును
మోడువారిన కొమ్మ నుంచి
రెండు లేతపచ్చ చిగుర్లు తలలూపుతూ
ఎండినచోటే మళ్ళీ జీవితాన్ని పండించుకోవాలి
రేపటి ఆశే ఈ రోజున బతికించేది అంటున్నాయి
చిరుగాలి ఊగుతున్న
నైట్ క్వీన్ కొమ్మల చివర పూల గుత్తులు
సుగంధ లేఖలు రాసి
హృదయపు చిరునామాకు పంపుతున్నాయి
మామిడిచెట్టు మీద ఒంటరి కోయిల
విరహగీతాలు పాడుతోంది ఆర్తిగా
జంట గువ్వలు గూట్లోకి చేరుకుంటున్నాయి
సరాగాల సయ్యాటకు
ప్రకృతి అంతా ప్రేమమయం
ధైర్యవచనం ఆశల పందిరి
మనిషికి మాత్రమే ఎందుకు అంతులేని దుఃఖం
నిన్ను నువ్వు ప్రేమించుకో
నీ పక్కవాడిని నీలాగే ప్రేమించు
ఇదేగా పంచ మహా యజ్ఞాల పరమార్థం
ఆచరిస్తే ఎంతమధురం మనిషి జీవితం
అందని ఆశల వెంట పరుగులు ఆపేస్తే
తృప్తి అనురాగం ఆయుధాలుగా చేసుకుంటే
జీవనపోరాటం ఇక నల్లేరుమీద నడకే కదా
ఇదిగో ఈ సాయంసంధ్య వేళ
ఎన్ని పాఠాలు నేర్పుతోందో ఈ ఆమని
సుఖం దుఃఖం సమపాళ్ళు జీవితాన అంటూ
విరిసిన హరితవర్ణ భామిని
రాబోయే శోభకృత్ వత్సరానికి షడ్రుచుల
స్వాగత తోరణాలు కడుతోంది
ఈ వసంత యామిని





-రోహిణి వంజారి
9000594630

# వారాల ఆనంద్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార ప్రదానం




కరీంనగర్‌కు చెందిన సినీ విమర్శకులు, రచయిత వారాల ఆనంద్ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ కవి గుల్జార్ రాసిన గ్రీన్ పోయెమ్స్ కవితా సంకలనాన్ని తెలుగులో **ఆకుపచ్చ కవితల పేరుతో** అనువదించిన ఆయనకు మూడు నెలల కిందట కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద విభాగంలో అవార్డు ప్రకటించారు. గోవా రాష్ట్రం పనాజీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా వారాల ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దీని కింద రూ. 50 వేల నగదు, జ్ఞాపిక. ప్రశంసాపత్రం అందజేశారు. కొంకణి రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత దామోజర్ మౌజో అకాడమీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుముర్ శర్మ, కార్యదర్శి కె. శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డా॥ కేతవరపు రాజ్యశ్రీకి పురస్కార ప్రదానం




డా॥ కేతవరపు రాజ్యశ్రీకి పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ కే.వి.రమణాచారి, వంశీరామరాజు తదితరులు.

మార్చి 23న హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత్రి కవయిత్రి , కేతవరపు ఫౌండేషన్ స్థాపక అధ్యక్షులు డా॥ కేతవరపు రాజ్యశ్రీకి "డా॥ పోతుకుచి సాంబశివరావు గారి సాహితీ పురస్కారం - వంశీ- శుభోదయం ఉగాది సాహితీ పురస్కారం" అందజేశారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ & శుభోదయం గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరిగిన ఈ బృహత్కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా కె వి రమణ చారి, వంశీ వ్యవస్థాపకులు డా. వంశీ రామరాజు , ఈనాడు ఎడిటర్ ఎం నాగేశ్వరరావు , కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ బొల్లినేని కృష్ణయ్య , తిరుమల బ్యాంక్ ఛైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సునందామృతం

## అంకుశ న్యాయం-1

అంకుశం అంటే ఏనుగు కుంభస్థలమును పొడిచే సాధనం.

మావటి ఎంత పెద్దదైనా, మదించిన ఏనుగునైనా సరే అంకుశంతో భయపెడుతూ, తన ఆధీనంలో ఉంచుకోవటం చూస్తూ ఉంటాం. చెప్పినట్లు చేసేలా శిక్షణ ఇచ్చి, దానితో పనులు చేయిస్తూ ఉంటాడు.

దీనినే సుమతీ శతక కర్త ఇలా అంటాడు " **లావుగల దానికంటెను/ భావింపక నీతి పరుడు బలవంతుండౌ/ గ్రావంబంత గజంబును/ మావటివాడెక్కినట్లు మహిలో సుమతీ!"** అంటే పెద్ద పర్వతమంటి ఏనుగు కంటే చిన్నవాడైననూ మావటి వాడు ఎక్కుచున్నాడు అంటే దానిని తన బుద్ధి బలంతో లోబరుచుకున్నాడు. కాబట్టి శరీర బలం కలవానికంటే బుద్ధి బలం కలవాడే నిజమైన బలవంతుడు అని అర్థం. కాబట్టి

మనిషి బుద్ధి బలం ఎంత గొప్పదో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అంత పెద్ద జంతువును చిన్న అంకుశంతో వశ పరచుకోవడం మామూలు విషయం కాదు, అందుకే "అంకుశ న్యాయం" అనేది వాడుకలోకి వచ్చింది.

ఇలాంటి సంస్కృత న్యాయాలను మనకంటే ముందు తరం వాళ్ళు, పండితులు కావ్యాలలో, వాడుకలో ఉపయోగించారనే విషయాలు ప్రముఖ సాహితీవేత్త అయిన శ్రీయుతులు రెంటాల గోపాలకృష్ణ గారు "జాతీయాలు పుట్టు పూర్వోత్తరాలు మరియు సంస్కృత న్యాయాలు" అనే పుస్తకంలోనూ, అలాగే "తెలుగు జాతీయాలు" అనే పేరుతో బూదరాజు రాధాకృష్ణ గారు రాసిన పుస్తకంలోనూ కొన్ని న్యాయాలను గురించి మాత్రమే రాశారు. వాటిని అవసరమైన చోట రిఫరెన్స్ గా వాడుకుంటూ "శబ్దార్థ దీపిక " తెలుగు నిఘంటువు నుండి సేకరించిన న్యాయాలను నాదైన శైలిలో సందర్భోచితంగా వివిధ శతక పద్యాల సామ్యాలు,, పురాణేతిహాసాల ఉదాహరణలతో అక్షర క్రమంలో మీకు పరిచయం చేయబోతున్నాను. సహృదయతతో ఆదరించాలని కోరుకుంటూ...



-పురిమళ్ల సునంద
9441815722

# చైతన్యానికి చిరునామా దున్న ఇద్దాసు: జూలూరీ గౌరీశంకర్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు జూలూరీ గౌరీశంకర్, కళా జనార్ధనమూర్తి.

తత్వగీతాలలో దళితుల వేతన, అగ్రవర్గాల దురహంకారంపై నిరసన తెలిపిన తొలి దళిత కవి దున్న ఇద్దాసు అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. 19వ శతాబ్దానికి చెందిన దున్న ఇద్దాసు నల్గొండ జిల్లా వాసి అని ఆయన చైతన్యానికి చిరునామా అని అన్నారు. తొలితరం సామాజిక కవి దున్న ఇద్దాసు సంస్మరణ సభ సోమవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరిగింది.

కార్యక్రమం లో గౌరీశంకర్ మాట్లాడారు. ఇద్దాసు అచంచల తాత్వికతతో తత్వగీతాలలో మాయ, బ్రహ్మం, ఆత్మజ్ఞాన ప్రబోధం చేశారన్నారు. కార్యక్రమానికి గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించారు. గాయని తోట శ్రీలక్ష్మి, ఆత్మీయ సంస్థ నిర్వాహకురాలు నిర్మల, కాంగ్రెస్ నేత శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

# నవ్య నవనీతం

బొమ్మా-బొరుసు ఒరుసుకుంటేనే నాణెం విలువ
అమ్మా-నాన్నల కడుపు తీపి-కురుణారసం మేళవింపు
జీవన రథ గమనానికి శ్రీకార చక్రాలు
అమ్మ పాలు అమృత పానము

నాన్న ప్రేమ జీవన సుధారస ప్రవాహము
లోకం పోకడ, పరిచయాలందించేది నాన్న
గుండె మంచమ్మీద బాల్యాన్ని గంతులేయించి
వీపుగుర్రపు స్వారీ చేయించి
వేలు అతికించుకుని వెంటాడించి
సామాన్య జ్ఞాన జలధిలో ఈదులాడించే
ప్రత్యక్ష దైవ స్వరూపం కన్న తండ్రి
వాత్సల్య ఝరిలో మునకలు వేయించి,
చైతన్య పథములో అనుభవ కథలు వినిపించి
విద్యాబుద్ధుల వినీలాకాశములో
జ్ఞాన నేత్రాలు తెరిపించేది నాన్న

పైకొస్తే పొంగేది, చెడులో విహరిస్తే కుంగేది
పుత్రోత్సాహ పురుషార్థమే
అపురూపం, అనన్య సామాన్యం
రక్తం పంచిచ్చిన ఆరాట పోరాటం
నాన్న హృదయం నవ్య నవనీతం.



-ఐతా చంద్రయ్య
సెల్: 9391205299

# చరవాణి రెండు పార్శ్వాలు

మానవ మేధస్సును ఉపయోగించి ఎప్పటికప్పుడు అనేక కొత్త యంత్రాలు మరియు సాంకేతికతలు ఆవిష్కరింపబడుతున్నప్పటికీ, అవి మనిషిపై మంచి మరియు చెడు ప్రభావాలను చూపడం సహజమే.

నేడు మనిషి కనిపెట్టిన సాంకేతిక సాధనాల్లో ఒకటైన మొబైల్ ఫోన్ మానవాళికి ఒక పక్క విలువైన సమాచారాన్ని అందజేస్తున్నప్పటికీ మరో పక్క యువత తమ విలువైన సమయాన్ని వృధా చేస్తోందని, వారిపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోజుల్లో ఇంటర్నెట్ వల్ల ఎన్ని లాభాలో అన్ని నష్టాలు కూడా అని కొందరు అనుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ లాభ, నష్టాలు అనేవి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నిమనం ఉపయోగించే పద్ధతి పై ఆధారపడి ఉంటుందన్న విషయం మాత్రం సుస్పష్టం.

మార్టిన్ కూపర్ అనే అమెరికన్ ఇంజనీర్ ఎన్నో మంచి ఆలోచనలతో మరియు గొప్ప ఆశయంతో అవిశ్రాంతంగా పనిచేసి ఏప్రిల్ 3, 1973న మొబైల్‌ని అందుబాటులోకి తెచ్చారు. అప్పటినుండి మొబైల్ ఫోన్ కాలానుగుణంగా అభివృద్ధి చెందుతూ మానవాళికి అనేక విధాలుగా సేవలందిస్తుంది.

మొబైల్ యొక్క ప్రధాన లక్ష్యాలు దూరంగా ఉన్న వారి సమాచారం తెలుసుకొనుటకు, వైద్యం, విద్య, బ్యాంకింగ్ సేవలు మరియు రైలు మరియు రవాణా సేవల సమాచారాన్ని అందించడంతోపాటు సందేశాలు పంపడం, సంగీతం వినడం, సినిమాలు చూడటం, చరిత్రలను తెలియని విషయాలను తెలుసుకోవడం, లాంటి చాలా ప్రయోజనాలు ఉన్నాయనేది మనందరికీ తెలిసిందే.

ఈ మధ్య కాలంలో మొబైల్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని ఓ సర్వే వెల్లడించింది. నవంబర్ 2022 సర్వే గణాంకాల ప్రకారం, ప్రపంచ జనాభా 8 బిలియన్లు, అందులో 5.44 బిలియన్లు మొబైల్స్ ఉపయోగిస్తున్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో ఇది ప్రతి ఒక్కరికీ నిత్యావసర వస్తువుగా మారింది మరియు మొబైల్ లేకుండా జీవించలేము అనే స్థాయికి చేరుకుంది.

నేటి తరంవారు మాత్రం మొబైల్స్ కి బానిసై నిద్ర లేచినప్పటి నుండి పడుకునే దాకా గంటల తరబడి అవసరం లేని విషయాల కోసం అమూల్యమైన సమయాన్ని వృధా చేస్తూ, పనికిరాని విషయాలమీద పట్టు సంపాదించి, అవసరం లేని తగాదాలలో తలదూర్చి, పనికొచ్చే విషయాలను పక్కనపెట్టి తమ బంగారు భవిష్యత్తు కోసం ఆలోచన చేయకుండా మొబైల్స్ తో కాలక్షేపం చేస్తున్నారు. మొబైల్ ఇప్పుడు కౌమారదశలో ఉన్న వారి దైనందిన జీవితంలో అంతర్భాగంగా ఉంది.

ఎన్నో మంచి ఆలోచనలతో దూరంగా ఉన్న వారి సమాచారం తెలుసుకునేందుకు మార్టిన్ కూపర్ మొబైల్స్ కనిపెడితే. నేడు అందుకు భిన్నంగా దూరంగా ఉన్న వారి సమాచారం తెలుసుకుంటూ, ప్రేమ, ఆప్యాయత, అనురాగాలతో కూడుకున్న మానవ సంబంధాలను మరిచి అయినవారికి దూరమవుతున్నారు, దూరం వారికి దగ్గరవుతున్నారు. కొంతమంది వారి వ్యక్తిగత విషయాలను ఫేస్బుక్, వాట్సాప్, ట్విట్టర్ మరియు సోషల్ మీడియా ద్వారా బహిరంగంగా ప్రచారం చేసుకుంటూ అనవసరమైన గొడవలకు దారి తీస్తూ మరియు సైబర్ బెదిరింపుల వలన ఆర్థిక వనరులను కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న విషయం మనందరికీ తెలిసిందే. మొబైల్ సాంకేతిక సాధనం నుండి సామాజిక సాధనంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు.

మొబైల్ యువతపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు చెబుతున్నప్పటికీ, కొంతమంది యువత మొబైల్ ఆధారంగా విద్యార్థులకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి ఒక అభ్యాస సాధనంగా ఉపయోగపడుతుందని నిరూపిస్తున్నారు.

## నిరుపేదల సమస్యల పరిష్కారం కొరకు ట్విట్టర్:

ఒడిశాకు చెందిన డిజిటల్ కార్యకర్త ఉపేంద్ర మహానంద్ ట్విట్టర్ సాయంతో పలు గ్రామాల్లోని పేదలకు పెన్షన్లు, రేషన్ కార్డులు, తాగునీరు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. 41 ఏళ్ల అతను ఈ విధంగా ఇప్పటివరకు 50కి పైగా కేసులను పరిష్కరించాడంటే అతన్ని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఉపేంద్ర తన తల్లిదండ్రుల కష్టాలను చూసి అభాగ్యులకు సహాయం చేయాలనే తపనతో ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. సోషల్ మీడియా గురించి తెలుసుకోవడానికి, ఉపేంద్ర 2020లో ఫిర్యాదుల పరిష్కారం కోసం ట్విట్టర్ ప్లాట్‌ఫారమ్ అయిన 12baje12minute నిర్వహించిన ఆన్‌లైన్ సెషన్‌కు హాజరయ్యాడు. ఇక్కడ, అతను సోషల్ మీడియా ను ఎలా ఉపయోగించాలి మరియు ప్రజల సమస్యలను త్వరగా మరియు పారదర్శకంగా ఎలా పరిష్కరించాలో నేర్చుకున్నాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లేవనెత్తిన సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కట్టుబడి ఉన్న ఒడిశా ప్రభుత్వం యొక్క 5టి మోడల్ గురించి కూడా అతను తెలుసుకున్నాడు. తరువాత, అతను కంటెంట్ రైటింగ్‌లో శిక్షణ పొందాడు, లక్ష్య ప్రేక్షకులను సమర్థవంతంగా చేరుకోవడానికి మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫారమ్‌లో సరైన ట్యాగ్‌లు మరియు హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించడం నేర్చుకున్నాడు మరియు వెనుకబడిన వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రావీణ్యం సంపాదించాడు.


దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల వారు నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం ప్రముఖుల, విద్యావేత్తల నుండి ఆర్థిక సహాయం కొరకు ట్విట్టర్ ద్వారా సమాచారం అందించి

> **మొబైల్ ఆవిష్కరణకు ముందు పిల్లలు మరియు యువకులు ఇతరుల కంటే ఎక్కువ సృజనాత్మకతను కలిగి ఉండేవారు. ాంటిది మొబైల్ వచ్చాక సృజనాత్మకతను కోల్పోతున్నారు.**

సహాయాన్ని పొందుతున్నారు. మొబైల్ ద్వారా పేదల సమస్యలకు సత్వర పరిష్కారం అభినందనీయం.

## విద్య, ఉద్యోగ, ఎమర్జెన్సీ సేవలు అందిస్తున్న ఇంటర్నెట్:

కమ్యూనికేట్ చేయడంతో పాటు, ఆన్‌లైన్‌లో ప్రశ్నను శోధించడం, ఆన్‌లైన్‌లో వార్తలపై సమాచారాన్ని పొందడం మరియు ఆన్‌లైన్‌లో



విద్యా వీడియోలను చూడటం వంటివి. మొబైల్ ఫోన్‌లతో అభ్యాస శైలి యొక్క ప్రభావాన్ని పెంచడమే కాకుండా, టీనేజ్ వారికి సులభంగా అధ్యయనం చేయడంలో కూడా ఇది సహాయపడుతుంది. కరోనా సమయంలో విద్య. ఉపాధి కల్పనలో అనేక మార్పులు వచ్చిన సంగతి మనందరికీ తెలిసిందే. ఇంటర్నెట్ మరియు మొబైల్ సేవలు విద్యార్థులకు ఇంటి నుండి చదువుకునే అవకాశాన్ని అందించాయి మరియు ఉద్యోగులు కూడా కరోనా నుండి బయటపడటానికి ఇంటి నుండి పని చేసారు మరియు బ్యాంక్ సేవలు మరియు ఇతర ప్రభుత్వ సేవలు కూడా అందించబడ్డాయి. కరోనా లాక్ డౌన్ సమయంలో ఇంటర్నెట్ సేవలు బాగా అభివృద్ధి చెందాయి. లాక్ డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన వారు కూడా ఇంటర్నెట్ ద్వారా ఉపాధి కోసం వెతుకుతున్నారు. ఇప్పుడు ఉద్యోగం కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన

> **ఫోన్లు లేనప్పుడు మనిషి ఎంత దూరమైనా వెళ్లి కలుసుకుని ఆప్యాయంగా మాట్లాడేవాడు కానీ ఫోన్ రాకతో మనిషిలో ఆప్యాయతతో పలకరించే మనస్తత్వం మాయమైపోతుంది.**

అవసరం లేదు. ఉద్యోగావకాశాల కోసం కోచింగ్ ఫీజులు కట్టలేక యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్న ఎడ్యుకేషనల్ వీడియోలను చూసి సన్నద్ధమై ఉన్నత స్థాయికి చేరుకున్న పేద విద్యార్థులు ఎందరో ఉన్నారు.

## విద్యార్థులపై మొబైల్ ప్రభావం:

కంప్యూటర్, మొబైల్, కాలిక్యులేటర్ ఆవిష్కరణకు ముందు పిల్లలపై ఎలాంటి సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం లేదు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన గణిత లెక్కలు ఎలాంటి ఆధారం లేకుండా అవలీలగా చేసేవారు. కానీ కాలక్రమేణా కంప్యూటర్, మొబైల్, కాలిక్యులేటర్ రాకతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి లోపంతో పాటు బద్ధకస్తులుగా తయారువుతున్నారు. అంతేకాకుండా మొబైల్ ఆవిష్కరణకు ముందు పిల్లలు మరియు యువకులు ఇతరుల కంటే ఎక్కువ సృజనాత్మకతను కలిగి ఉండేవారు. అలాంటిది మొబైల్ వచ్చాక సృజనాత్మకతను కోల్పోతున్నారు. ఈ విషయాన్ని తాజాగా అధ్యయనం చేసిన పరిశోధకులువెల్లడించారు. తల్లిదండ్రులు, గురువుల పర్యవేక్షణ లేనందున అతి చిన్న వయసు నుండే మొబైల్ వ్యసనంగా మారింది. ఆ వ్యసనం పిల్లల మెదడుపై ప్రభావం చూపి సృజనాత్మకతను తగ్గిస్తుందని పరిశోధకులు నిర్వహించిన న్యూరోఇమేజింగ్ అధ్యయనంలో వెల్లడైంది.

యువతతో పాటు యువకులు కూడా ఫోన్‌ను విపరీతంగా వినియోగిస్తున్నారు. కొంతమంది షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ తమ టాలెంట్ చూపిస్తున్నారు. మరికొందరు సమాజంలో జరుగుతున్న యదార్థ సంఘటనలు, సామాజిక స్పృహ కలిగిన సంఘటనలను షార్ట్ ఫిల్ములుగా చిత్రీకరించి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. దీని వల్ల సమాజంలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది.

ఈ మధ్య కాలంలో ఫోటోల క్రేజ్ బాగా పెరిగిపోయింది. ఎక్కడికి వెళ్లినా ఫోన్‌లో ఫోటోలు దిగడం అలవాటుగా మారింది. అంతేకాకుండా రోడ్లపై ఫోటోలు దిగడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా మార్పు రాకపోవడం బాధాకరం.

## ఆరోగ్యంపై మొబైల్ ప్రభావం:

మొబైల్స్ విడుదల చేసే రేడియేషన్ గుండెను దెబ్బతీస్తుందని నిపుణులు చెపుతున్నారు.

ఎక్కువసేపు మాట్లాడటం వల్ల వినికిడి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెవి, ముక్కు, గొంతు నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఈమధ్య ఫుడ్ కి సంబంధించిన అప్లికేషన్స్ రావడంవల్ల చాల మంది బయట నుండి ఫుడ్ ఆర్డర్స్ చేస్తూ ఇంట్లో వంటకి ప్రాధాన్యత ఇవ్వటంలేదు అందువల్ల అనారోగ్యాలకు గురిఅవుతున్నారు.

ఒకప్పుడు పిల్లలు అన్నం తిననని ఏడుస్తుంటే, తల్లి చందమామను చూపిస్తూ, వారికి ఊసులు చెబుతూ అన్నం తినిపించే వారు. కానీ ఈ స్మార్ట్ కాలంలో ఉన్న అమ్మలు పిల్లలకు స్మార్ట్ ఫోన్ లో చందమామ లేకపోతే, స్మార్ట్ ఫోన్ లో పిల్లల వీడియోలు పెడుతూ, అన్నం తినిపించడం జరుగుతుంది. దీని వలన పిల్లలకు చిన్ననాటి నుండే స్మార్ట్ ఫోనే అంటే ఆసక్తి పెరుగుతుంది. మొదటగా పిల్లలకు ఫోన్ ఆసక్తి పెంచేలా చేస్తుంది తల్లిదండ్రులే.

## మానవ సంబంధాల పై మొబైల్ ప్రభావం:

మొబైల్ ఆవిష్కరణకు ముందు, మానవ సంబంధాలు విలువలు ప్రజా జీవితంలో అత్యంత ముఖ్యమైనవి. అన్నదమ్ములందరూ ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఆత్మీయత అనురాగాలతో ఉమ్మడి కుటుంబంలోజీవించేవారు. అంతేకాదు గ్రామాల్లో సాయంత్రం వేళల్లో ఇంటి చుట్టుపక్కల వారందరూ కలిసి కష్టసుఖాలు మాట్లాడుకునే వారు. ఆ రోజుల్లో టెక్నాలజీ లేదు కాబట్టి చుట్టుపక్కల వాళ్ళు చెప్పేవే వార్తలు అనుకునేవారు. కానీ నేడు ఇంటర్నెట్ ప్రపంచంలో మానవ సంబంధాలన్నీ స్మార్ట్ ఫోన్ తోనే కాలం గడుపుతున్నాయి. గ్రామాల్లో కూడా వీధుల్లో కూర్చుని మాట్లాడుకునే వారు కరువయ్యారు. దీంతో పెద్దవాళ్లు కూడా సాయంత్రం అయితే చాలు టీవీలు ముందు, లేదా ఫోన్ పట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్స్‌తో సమయం వృధా చేసుకుంటూ మానవ సంబంధాలను దూరంచేసుకుంటున్నారు. ఒకే ఇంటి సభ్యులు కూర్చొని భోజనం చేసే సంప్రదాయాన్ని మరిచిపోయి స్మార్ట్ ఫోన్ కారణంగా మాట్లాడాలంటేనే విముఖత చూపుతున్నారు. ఆ రోజుల్లో పిల్లలు ప్రతి పండుగ మరియు వేసవి సెలవులను గ్రామాల్లో గడిపేవారు. కానీ ఇప్పుడు ఇంట్లోనుండి బయటకు రావటంలేదు టీవీ, మొబైల్ తోనే కాలం గడుపుతున్నారు. ఇంట్లో పెద్దవాళ్లు ఉన్నా పట్టించుకోకుండా పిల్లల చేతుల్లో ఫోన్లు ఉంటున్నాయి. సెల్ ఫోన్ల అప్లికేషన్లు మనిషికి అన్ని సౌకర్యాలు కల్పించి క్షణాల్లో ఇంటి నుంచి అన్నీ పొందే అవకాశం కల్పించి బద్ధకస్తులుగా చేశాయి. అందుకే మనిషికి ఫోన్ ఉంటే ఎవరితోనూ కలవాల్సిన అవసరం లేదన్న భ్రమలో ఉంటున్నారు. స్నేహితులకు, బంధువులకు దూరమవుతున్నారు. ఫోన్లు లేనప్పుడు మనిషి ఎంత దూరమైనా వెళ్లి కలుసుకుని ఆప్యాయంగా మాట్లాడేవాడు కానీ ఫోన్ రాకతో మనిషిలో ఆప్యాయతతో పలకరించే మనస్తత్వం మాయమైపోతుంది.

తల్లిదండ్రులు తమ పిల్లలను సోషల్ మీడియా నుండి దూరంగా ఉంచాలి - వారిని సరైన మార్గంలో ఉంచడానికి. సోషల్ మీడియా, మొబైల్ గేమ్స్ కాకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి. తద్వారా భావోద్వేగ సమతుల్యతను కాపాడుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంది.



-కోట దామోదర్
9391480475

# కన్నతల్లి, వేదన అత్తింటి తపన విధి ఆడిన నాటకం

ఈ నవల రచయిత శ్రీ కొత్తపల్లి ఉదయబాబుగారు వృత్తిరీత్యా అధ్యాపకులు. వృత్తిపరంగా రిసోర్స్ పర్సన్‌గా మరియు ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసలందుకున్న ప్రధాన ఉపాధ్యాయులు. ప్రవృత్తి పరంగా వీరు స్పృశించని సాహితీ ప్రక్రియలేదు అనటం అతిశయోక్తి కాదు. 6 కథా సంపుటులు వెలికి తీసుకువచ్చారు. నవలలు రంగస్థల నాటికలు రేడియో నాటికలు, పలు టెలిఫిల్మ్స్ రచయితగా ప్రతిభను ఇరు తెలుగు రాష్ట్రాలకు చవి చూపించి నారు. సమాజ సేవ సాహిత్యసేవ రెండు కన్నులుగా చేసికున్నారు.

ప్రస్తుత నవల **'మనసు చేసిన న్యాయం'** ప్రతిలిపి అను అంతర్జాల సంస్థ వారు నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందినది. ధారావాహికగా ప్రసారం కాబడి ప్రేక్షకుల ప్రీతిపాత్రమైనది. అందరు రచయితలా, కాక భిన్నంగా నడిచి ఆకట్టుకోవటం ఉదయబాబు ప్రత్యేకత. ప్రథమ పురుషతో సాగే ఈ నవల ఆద్యంతమూ ఊహించని మలుపులు తిరుగుతూ, లోకరీతికి భిన్నంగా సాగుతుంది. నవలలోని కథానాయకుడు వైభవ. మధ్యతరగతి కుటుంబం వాళ్ళది, కలిమి ఉన్నట్టు కాదు, అలాగని లేనట్టూ కాదు. ఉన్నంతలో 'గుట్టు'గా సంసారం సాగిస్తూ, పరువుకు ప్రాణమిచ్చే కుటుంబం. తల్లితండ్రి, ఒక అన్న, స్వశక్తితో పైకి రావాలని ప్రయత్నించే వాళ్ళు. అన్నకు పెళ్ళి అవుతుంది. సామాన్యంగా భర్త తరపు వారు భార్యను, భార్య తరపు/








వారినీ ఇబ్బందులు పెట్టటం చూస్తాం. కాని ఉదయబాబు నవలలో కథకుడి (వైభవ్) వదిన కుటుంబం నుండి ముఖ్యంగా, అత్తగారి నుండి సమస్యలు ఎదురవుతాయి. కరుగ్గా, చదువుతుంటేనే కంపరం కలిగించే ప్రవర్తనతో వైభవ్ కుటుంబాన్ని వేధిస్తూ ఉంటుంది. వదిన విజయలక్ష్మి పాత్రను ఉదయబాబు చిత్రించిన తీరు అద్భుతం. ఎక్కువగా మాట్లాడదు. తన తల్లి, భర్త కుటుంబం మధ్య చోటు చేసుకునే అవాంఛనీయ సంఘటలన్నింటినీ ఆమె కారకురాలు. అయినా, ఆమెఏ పక్షం వహించుతుందో.. తెలియదు. సాత్త్వి కులైన అత్త కుటుంబంలో ఉన్నంత మేరా వాళ్ళ పక్షమే ఉన్నట్లు, తల్లి దగ్గరకు వెళ్ళగానే అంతా తారుమారై తల్లివేపు మొగ్గుతుంది. ఈ సందర్భంలో ఉదయబాబు ఆమెను ఆమె తల్లిగారిని, ఇటు భర్త కుటుంబాన్ని వాళ్ళ మానసిక స్థితిని అక్షరీకరించిన తీరు పాఠకుడి మనసును హత్తుకుంటుంది. ఒక సందర్భంలో అంతా సమసిపోయిందని "శుభం" కార్డు పడనుందని పాఠకుడు అనుకుంటాడు. అంతలోనే ఘర్షణ మొదలయ్యి వైభవ్ ఇంటిల్లిపాదీ 'టెన్షన్'లో పడుతూ పాఠకుడిలో కూడా అలజడి రేపి ముందు ముందు ఏమవుతుంది అన్న 'టెన్షన్'ను కలిగి స్తారు రచయిత. మబ్బులు వీడినట్లే అనిపించటం, మళ్ళీ ముసురుకోవటంతో 'టెంపో' బాగా పోషించబడింది. అత్తగారింటి సాత్త్వికత, తల్లి తామసగుణం వల్ల విజయలక్ష్మి ఏం కోల్పోతోన్నదో మరికొంత వివరంగా ఉదయబాబు గారు చెబుతే ఇంకా బాగుండేదేమో! విజయలక్ష్మి కాపురానికి ఫలితంగా సాత్త్వికవ జన్మిస్తుంది. సాత్త్వికను వైభవ్ పెంచిన తీరు, సాత్త్విక మనోభావాలు చాలా ఉదాత్తంగా, వర్ణించబడింది. చివరకు సాత్త్విక పెరిగి పెద్దదయి, ఉద్యగం సంపాదించుకుని అమ్మా నాన్నల మధ్య సంధానకర్తగా నిలవటంతో నవల ముగుస్తుంది. సాత్త్వికతన అమ్మా నాన్నలతో ప్రయాణం చేస్తున్న రైలు తూర్పు దిక్కుగా అంటే అన్యాపదేశంగా సూర్యోదయం వేపు సాగిపోతోందని చెబుతూ నవల ముగుస్తుంది.

నవల సాగుతున్నంత సేపూ రచయిత ఎన్నో మంచి వాక్యాలని వర్ణనలని మనకు చెబుతారు. ఒక సాంప్రదాయకమైన పెద్దరికం ఇచ్చినపుడు దాన్ని స్వీకరించటంలో కూడా ఆనందం ఉంటుంది (15). సంఘటనల సాలేగూడు (16) పెద్దలు పెద్దలు దెబ్బలాడుకుంటే భవిష్యతు లేని వాళ్ళు పిల్లలే అవుతారు (87) అనుమానా లతో అపార్థాలతో మనసులు కలుషితమైతే ఆ పుట్టే పిల్లలు అలాంటి లక్షణాలతో పుడతారేమో (95). ఈ సందర్భంలో ప్రహ్లాదుని కడుపుతోన్న లీలావతికి నారదుడు చెప్పే విష్ణు కథల ప్రభావం ప్రహ్లాదుడిపై పడిన సందర్భం గుర్తుకు వస్తుంది.

నిజమైన రక్త సంబంధపు స్పర్శ ఒక దేహం నుండి మరో దేహానికి ప్రవేశించి ఒకరి పట్ల ప్రేమ మరొకరిలోకి లీనమవటం (100) దుష్యంత మహారాజు కొలువులో శకుంతల తన కుమారుడిని చూపుతూ "ఈ విపరీత ప్రతిభాష లేమిటికి ఉర్వీనాధ! ఈ పుత్రగాత్ర పరిష్వంగన సుఖము చేకొనుము" అని అంటున్న సన్నివేశము గుర్తుకు వస్తుంది!

ఒక మంచి నవలను చదివామన్న సంతృప్తి పాఠకులకు తప్పక కలిగిస్తుంది. రచయితకు అభినందనలు.

**ప్రతులకు:** కొత్తపల్లి ఉదయబాబు
ఫ్లాట్ నెం.301,
హెూమ్‌లైన్ పామ్స్ రెసిడెన్సీ,
బాబూ జగ్జీవన్‌రాం రోడ్,
డిఫెన్స్ కాలనీ, సైనిక పురం పోస్ట్,
సికింద్రాబాద్-500 094.
సెల్:9441860161
9533756075



- కూర చిదంబరం
సెల్:8639338675

పుస్తక సమీక్షలు

# 'కోట' వారి తెనుగు సారస్వత దీప్తి- 'నీతి సుధా లహరి..'

సంస్కృతంలోని నీతి శాతిశాస్త్రం అనే ఉత్తమ గ్రంథాన్ని తెలుగువారికి, తాత్పర్య వ్యాఖ్యలను జోడించి 151 శ్లోకాలను **'నీతి సుధా లహరి'**గా తెలుగు అనువాదంగా, విద్వత్కవి కోట రఘురామయ్య అందించారు. ఈ ప్రాచీన శ్లోక సంకలనానికి డా॥ వింజమూరి విశ్వనాథమయ్య, సాధారణ పాఠకులకు, యువతకు తేలికగా అర్థమయ్యేటట్టు సరళమైన తెలుగు వచనంలో వివరణగా తాత్పర్య విశేషాలు రచించారు. యిద్దరు విద్వ ద్వరేణ్యుల సత్కృషి ఫలితంగా ధార్మిక, నైతిక, తాత్త్విక సూక్తులకు కాణాచి అయిన జనని సంస్కృతంలోని అమూల్య అనర్ఘరత్నాలు, తెలుగులో, వెలుగు చూసాయి. కోటవారు, మూలంలోని పదాలను ఒడుపుగా ఉపయోగించుకొంటూ తెనుగు తనాన్ని నుడికారపు తుది మెరుగులతో తెనుగు చేయడంతో, ఈ గ్రంథం నీతి సాహితీ సరస్వతి గళ సీమలో వినూత్న ముత్యాల హారంగా ఆకట్టుకొంటోంది. ఉ.దా.కు **"పుస్తకం వనితా**





**విత్తం పరహస్తం గతం గతమ్"** అనే శ్లోకానికి కందంలో

> **"విత్తంబును, బిత్తరియును**
> **పొత్తము, పెరవారు గొంచు బోయిన బోవున్**
> **ఎత్తరి నైనను వచ్చిన**
> **కత్తెరబడు, భ్రష్టమగును, ఖండంచెయగున్"**

అన్నారు అచ్చ తెనుగు గుబాళింపుతో..


"చితా చింతా ద్వయోర్మధ్యే" అనే శ్లోకానికి ఆటవెలదిలో

> **"చితియు, చింతలోన చింతయే గొప్పది**
> **చితి శవమ్ము కాల్చు, చింత చూడ**
> **బ్రతికియున్న వాని రంపాన రాచును**
> **ధాతనైన వాని తాతనైన"** అన్నారు.

> **"యాగమ్మై, యాగమ్మై**
> **మాగిన చూతక ఫలమయి, మధురామృతమై**
> **సాగెను మీ సత్కవనము**
> **రాగాత్మక మగుచు కోట రఘురామయ్యా!"**

అంటూ పద్యమౌళి డా॥ రాధశ్రీ ప్రశంస, అక్షర సత్యంగా ఈ గ్రంథం రుజువు చేస్తోంది.

ప్రతులకు: డా॥కె. శ్రీధరరావు
ప్లాట్ నెం.60, సుశీలా హాస్పిటల్
రోడ్‌నెం.3, ఎస్.ఆర్.కె.పురం
హైదరాబాద్-500 035.



-జయసూర్య
సెల్:9014948336
9394775088

# చంద్రుడు చెప్పిన చల్లని వెన్నెల కథలు....

బాలల ఉజ్వల భవిష్యత్తు కొరకు బంగారు బాటలు వేసేది బాల సాహిత్యం.బాలల కోసం రచనలు చేసేది కొందరైతే,బాలల చేత రచనలు చేయించేది మరికొందరు.కథకులు యాడవరం చంద్రకాంత్ బాలల కోసం కథలు వ్రాయడమే కాకుండా, నిరంతరం బాలల చేత కథలు, కవితలు, గేయాలు వ్రాయిస్తూ ,వారిలోని సృజనను ప్రోత్సాహిస్తున్నారు. వీరు ఇచ్చిన ప్రోత్సాహముతో చాలా మంది పిల్లలు అద్భుతమైన రచనలు చేస్తూ, బహుమతులు కూడా సాధిస్తున్నారు.

ఒక వైపు ఉపాధ్యాయునిగా పాఠాలు బోధిస్తూనే మరొకవైపు విద్యార్థులు సాహిత్యంలో రాణించేలా కృషి చేస్తున్న చంద్రకాంత్ తన మొదటి ప్రయత్నం గా బాలల కథలను ఎంచుకోవడం హర్షణీయం. ఆ పుస్తకమే "చంద్రుడు చెప్పిన కథలు".ఇందులో 35 కథలున్నాయి.ప్రతి కథ అర్థవంతమైనదే.ఈ కథలన్ని వివిధ పత్రికల్లో ప్రచురితమై పదిమంది మెప్పు పొందినవి.

గ్రామీణ ప్రాంత నేపథ్యం గల చంద్రకాంత్, తాను వ్రాసిన ఈ కథల్లో పల్లెటూరి సంస్కృతులు, పాఠశాల జీవనం, బాలల ఆశయాలు లాంటి పిల్లలకు ఉపయోగపడే అంశాలకు పెద్దపీట వేసారు.తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్న ఒక ప్రవాస భారతీయుని కథ "ఊరి రుణం" ఎందరికో స్ఫూర్తి నిస్తుంది. బాల్య వివాహాలు వద్దు- బాలికల చదువే ముద్దు అనే సందేశమును "శబాష్ గణేష్ "అనే కథ బోధిస్తుంది.

రక్త సంబంధం కంటే మానవ సంబంధాలు మిన్నగా ఉండాలనే ఆశయం తో సాగిన "మానవత్వం" కథ కంటతడి పెట్టిస్తుంది. అందరూ ఉన్నను అనాథ శవంలా మారిన







పండుటాకు మహా ప్రస్థానం నేటి సమాజ స్థితిగతులకు అద్దం పడుతుంది. రోడ్డు మీద ధాన్యం కుప్పలు పోయడం వలన నిండు జీవితాలు ఎలా బలవుతున్నాయో "నిర్లక్ష్యం ఖరీదు " కథ ద్వారా వివరించారు.

జీతం పెరిగినప్పుడో, ఇంక్రిమెంట్లు వచ్చినప్పుడో కలిగిన సంతోషం కన్న విద్యార్థులు ప్రయోజకుల వ్వడము ద్వారా ఉపాధ్యాయులకు నిజమైన సంతోషం కలుగచేస్తుందని " గురుదక్షిణ " కథ తెలియచేస్తుంది.చదువు కోవడానికి పేదరికం అడ్డురాదని,సంకల్ప బలం ఉండాలని చెప్పే "లక్ష్య సాధన " కథ ఎందరో విద్యార్థులకు మార్గదర్శనం చేస్తుంది.


సాంకేతికతను అవసరాలకు వాడుకోవాలి కానీ,అతిగా వాడితే అనారోగ్యానికి దారితీస్తుందని "సెల్ ఫోన్ తెచ్చిన తంటా" ద్వారా చెప్పిన కథ మనలను ఆలోచింపచేస్తుంది. రసాయన ఎరువులు వాడవద్దు-పశవుల పేడతో తయారైన సేంద్రీయ ఎరువులు వాడి రైతులు ప్రయోజనం పొందాలని "సేంద్రీయ వ్యవసాయం" కథ సూచిస్తుంది.

ఇలా ఈ పుస్తకంలో ఉన్న ప్రతి కథలో ఒక నీతి ఉంది. చక్కని ప్రయోజనం ఉంది. ఈ కథలు పిల్లల లోకానికి ఆనందాన్ని ఇవ్వగలవు. మంచి గుణాలను నేర్పగలవు. ఒకప్పుడు చందమామ రావే, జాబిల్లి రావే అని పిల్లలకు గోరుముద్దలు తినిపించే తల్లులు, ఈ రోజుల్లో సెల్ ఫోన్ పాటల ద్వారా తినిపిస్తున్నారు.ఈ చంద్రుడు చెప్పిన కథలు చెబితే, చిన్నారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఇప్పటివరకు 100 బాలల కథలు,125 కవితలు,75 పుస్తక సమీక్షలు, 50 సమకాలీన వ్యాసాలు,25 బాలగేయాలు వ్రాసి బాల సాహితీ లోకంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న సిద్ధిపేట చంద్రకాంత్, తన పిల్లలకు కూడా ప్రేరణగా నిలిచారు. కుమారుడు రేవంత్ ,కుమార్తె సహస్రలు ఎన్నో కథలు, కవితలు, గేయాలు వ్రాసారు.వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన సందర్భాలున్నాయి.

చిన్నారి బాలలను ఎంతగానో అభిమానించే ఉపాధ్యాయులు చంద్రకాంత్ మరిన్ని పుస్తకాలతో అబాలగోపాలాన్ని ఆనందింప చేస్తారని ఆశిస్తున్నాను.

ప్రతులకు :యాడవరం చంద్రకాంత్ గౌడ్
ఇ. నం.4-146/డి, రాఘవేంద్ర నగర్,సిద్ధిపేటసెల్ : 9441762105



-భైతి దుర్గయ్య
9959007914

# కాలపు సుడిగాలిలో వేగంగా అడుగులు..!!

ఎడతెరిపి లేకుండా కార్చిన కన్నీళ్లతో
తనువు శిఖరంలోని కంటి నది ఎండిపోతుంది
ఆకాశగంగ కూడా అలిసిపోయినట్లు
కనురెప్పల మధ్య ధార నిలిచిపోయింది..

ఒంటరి నావలో నడి సముద్రపు ప్రయాణం
సుడులు తిరుగుతూ మెరుస్తుంది ఆశల సౌధం
అమ్మకానికి పెట్టిన ముత్యపు సౌందర్యాన్ని చూస్తుంటే
బ్రతుకు ప్రయాణంలో తిమింగలం అడ్డుపడింది..

కాలపు సుడిగాలిలో వేగంగా అడుగులు
నేలపై మనిషి ఆకాశపు మధ్యలో తిరుగుతుంటే
రెండు చేతులతో చూడని స్వర్గం పిలుస్తుంటే
నేలమీద సంపాదించిన పాపపుణ్యాలు లెక్కిస్తుంది..

ఆర్థికంగా పక్క జీవి రెక్కలు విరిచి వేస్తూ
కోట్ల రూపాయలను ఆకాశానికి కట్టలుగా పేరిస్తే
శ్రమజీవి సౌందర్యం నేలపై ఏడుస్తుంటే
రైతు కళ్ళకు ఎన్నో ఆనకట్టలు కడుతున్నారు..

చినిగిన వస్త్రం శీలం యొక్క గొప్పతనం చెప్పితే
మడతలు పడిన చీర మౌనంగా రోదిస్తుంది
పిడికెడు మెతుకులు దొరకని జీవితం లో రోదనలు
రొంపిల తయారైన సమాజంలో వికసించని కమలం..

నా భావాలు బరువెక్కి ఏడుస్తుంటే
తేలియాడుతూ అయోమయంగా రాతలు రాస్తుంటే
విశ్లేషణలు విమర్శలు అర్థము చెప్పుతూ వివరిస్తుంటే
కవిత్వానికి కలిసిరాని కాలములో కలం కదులుతుంది..



-కొప్పుల ప్రసాద్
9885066235

# ప్రతిరోజూ కొత్తనే

నిత్య నూతనం
ప్రతి యత్నం!
జయాపజయాలు
సమం సమం!!

పరీక్షలా భావించకు
ప్రయోగములా ప్రయత్నించు!
విసుగుచెందని తనమే
విజయానికి సోపానం!!

నీ అడుగుల ముద్రలతో
మరో ప్రపంచానికి మార్గం వేయి!
చూడడానికి వామనుడవే
కొత్త రూపం చూపిస్తే
నీ కాలికింద భూగోళం !!

ప్రతిరోజూ కొత్తనే!
మొలకెత్తే ఆశనే!!



-జగ్గయ్య.జి
9849525802

# కుమ్మర వృత్తికి "ఆధునిక" సాంకేతికతను అందించాలి

దేశానికి స్వాతంత్ర్యంవచ్చి75 సం॥రాలు ఐనప్పటికీ కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు " స్వదేశీ ఉత్పత్తుల" అభివృదికి. గ్రామీణ వృత్తుల ఆధునికీకరణకు ఆధునాతన సాంకేతికతను ఆశించిన మేరకు అందించడలో విఫలమైనాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ఉపాధి అవకాశాల కల్పనలో బహుముఖ పాత్ర పోషించే "కులవృత్తులైన" చేనేత, కుమ్మర వృత్తి, కమ్మరి వడ్రంగి మేదరి మొదలగు వృతుల ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ తగ్గడం వల్ల గ్రామీణ వృత్తుల మీద ఆధారపడిన కార్మికులు ఈవృత్తులను వదులుకొని (నిస్క్రమించి) పట్టణాలకు వలస వెల్లి రోజువారీ కూలీలుగా మారి శ్రామిక మార్కెట్లో ఎక్కువ గంటలు పనిచేస్తూ తక్కువ వేతనాలు పొందతు శ్రమదోపిడికి గురౌతున్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు పొందడం లేదు. గ్రామీణ చేతివృత్తులు కూడు పెట్టని దశకు చేరుకున్నాయి. నాడు **"కుల వృత్తిని మించింది లేదు గువ్వల చెన్నా"** అన్న నానుడి నేడు " కుల వృతులను వదిలిందే మిన్న ""అన్న సంస్కృతి సమాజములో చోటు చేసుకుంది.

### ప్లాస్టిక్ డిమాండ్ కుమ్మర వృత్తి

ప్లాస్టిక్ ఉత్పత్తులకు' సిల్వర్ వస్తువులకు మార్కెట్లో గిరాకీ పెరిగటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కుమ్మరవృత్తి కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి . ఎంతో "కళానైపుణ్యం" తో కూడుకున్నకుమ్మర వృత్తి ఆదరణ లేక అంతరించే పరిస్థితులు నెలకొన్నాయి. కుమ్మర వృత్తి కూడు పెట్టని దుస్థితిలో కొట్టుమిట్టాడటం శోచనీయం.

### మానవ నాగరకత కుమ్మర వృత్తి

"మానవ నాగరికతకు తొలి మెట్టు కుమ్మరి కుండ ఆయువు పట్టుగా" నిలిచి మానవ చరిత్ర సంస్కృతి వారసత్వ అవశేషాల అధ్యయనానికి దోహద పడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి ఆహారాన్ని వండుకోవడానికి వంట పాత్రలు సమకూర్చి. మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించి (కలిగించి) ప్రజారోగ్యానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధి లేక దుర్భరమైన జీవితాలను వెల్లదీస్తున్నారు.

### మానవ మనుగడ కుమ్మర వృత్తి

మనిషి పుట్టుక, పెళ్లి, చావు మరియు దైవకార్యక్రమాల్లో కుమ్మర ఉత్పత్తులు కుండలు 'గురుగులు కూర వండు కోవటానికి ఎసులలు అటికెలు నీటినిలువ కు తొట్టిలు రంజాన్ లు 'కడువలు 'పెళ్ళిలో ఐరేని కుండలు వినియోగిస్తారు. మానవ మనుగడలో మట్టి పాత్రలు ప్రధాన పాత్ర పోషించాయన్నది చారిత్రిక సత్యం ఇందుకు మోహంజదారో" హరప్ప మసపుటోనియా' సిందూ నాగరికత అధ్యయనాల్లో వెల్ల డైంది . ఆధునిక కాలంలో నూతన గృహ ప్రవేశం' ప్రభుత్వ భ్వనాల భూమి పూజ దేవతలకు సమర్పించే బోనాలు మొన్నగు "శుభ "మరియు ' దైవ' కార్యక్రమాల్లో కుమ్మర కుండలు ఉపయోగిస్తారు. మానవ జాతి మనుగడకు నాగరికత, సంస్కృతికి, కుమ్మర కుండకు విడదీయలేని సంబంధం వుంది. మట్టిని నమ్ముకొని మానవాళి మనుగడ కొరకు పర్యావరణ రక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర కుల వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

### ప్రపంచీకరణ కుమ్మర వృత్తి

ప్రపంచీకరణ విసిరిన" పంజాకు" "కుమ్మర వృత్తి కుదేలైంది..వేగంగా విస్తిరిస్తున్న పారిశ్రామికీకరణ, కార్పోటీకరణ, పట్టణీకరణ, జనాభా పెరుగుదల ప్లాస్టిక్ వినియోగం పై పెరిగిన క్రేజీ మార్కెట్ ప్రకటనలవల్ల ప్రజల్లో పెరిగిన విదేశీసంస్కృతి స్టీలు పాత్రలు' ప్లాస్టిక్' సిల్వర్ అల్యూమినియం వినియోగం బాగాపెరిగింది. మార్కెట్ మాయాజాలంలో మట్టి పాత్రలకు ఆదరణ లేక డిమాండ్ తగ్గింది. కుమ్మర వృత్తి కుదుపెట్టని స్థితికి దిగజారింది కులవృత్తిని వదులుకొని 'ప్రైవేట్' అసంగటి తరంగంలోకి కుమ్మరి వృత్తి కార్మికులు వలస పోయి అల్ప వేతనాలకుపనిచేస్తూ శ్రమ దోపిడీకి గురై రెక్కాడితే డొక్కాడని స్థితిలో కఠిన పేదరికం అనారోగ్యానికి గురవుతున్నారు .దినసరి వేతన కార్మికులుగా(అడ్డాకూలీలుగ) జీవితాలు వెళ్లదీస్తున్నారు.

### పేదరికం కుమ్మర వృత్తి

జీవనోపాధి లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తూకనీస అవసరాలు తీర్చుకోని దుస్థితిలో వున్నారు. విద్య' వైద్యము పక్కాగృహ వసతి లేక నిరుద్యోగం 'నిరక్షరాస్యత ఆకలి చావులు 'అల్ప పౌష్టికాహారంఅప్పుల బాధలు కుమ్మర వృత్తిదారుల పాలిట శాపాలుగా మారాయి .

### ప్రభుత్వం కుమ్మర్ల సంక్షేమం

ప్రభుత్వాలు' కుమ్మరవృత్తి దారుల సంక్షేమానికి ఆర్థికవికాసానికి సమగ్రమైన పథకాలు అమలు చేయక పోవటం వల్ల కుమ్మర వృత్తి దారుల సాంఘిక 'ఆర్థిక వికాసం సామాజిక వికాసంఎండ మావిగా మారటం శోచనీయం. ప్రభుత్వాలు ఇతర కుల వృత్తులను అన్నిరకాలుగా ఆదుకుంటున్న విధంగా కుమ్మ వృత్తిని ఆదుకోవాలి. మానవ నాగరికత మానవచరిత్రనిర్దారకుఉపయోగపడే కుమ్మరవృత్తి కిపూర్వ వైభవం తేవాలి.

### ఆధునిక సాంకేతికత కుమ్మర వృత్తి

ఆధునిక సాంకేతికతను సమాచార రంగములో వస్తున్న నూతన సాంకేతిక విధానాల పట్ల ఉత్పత్తి పద్ధతుల పట్ల కుమ్మర యువతకు అవగాహన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం. కొనసాగించి కుమ్మర యువతలో శ్రామిక సామర్థ్యం పెంపొందించే ఉత్పత్తి విధానాలకు "వృత్తినైపుణ్యాభివృద్ధి"కి పెద్దపీట వెయ్యాలి.

### మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వం కుమ్మర వృత్తికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. కుండలు కాల్చడానికి వాము బట్టిలు పెట్టుకోవటానికి స్థలము సమకూర్చాలి. చెరువుల్లో నుండి కుమ్మరి మట్టిని ఉచితంగా తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలుకు నోచుకోక పోవడం వల్ల కుమ్మర మట్టిని పొందడంలో కుమ్మర వృత్తి దారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు .మట్టి సేకరణ తదితర ముడిసరుకులు ' తమ ఉత్పత్తులకు స్టోరేజ్ వసతి అడవుల నుండి ఉచితంగా కలప వాము కాల్చడానికి పొరక తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రెవిన్యూ అటవీ శాఖ అధికారులు అమలు చేసేట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యాలి . ప్రభుత్వాలు విధించే సీవరేజ్ సెస్ ' వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినహాయించాలి.

చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్న ఉచిత విద్యుత్తు సౌకర్యం కుమ్మర వృత్తి దారులు ఉపయోగించే విద్యుత్తు "సారెకు" ఇవ్వాలి.

కుమ్మర వృత్తి దారులకు షెడ్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా భూమిని స్థలాన్ని కేటాయించాలి.

గ్రామ పంచాయితీ 'మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్ నెలకొల్పిన షాపింగ్ కాంప్లక్స్ ల్లో కుమ్మరి వృత్తి దారుల ఉత్పత్తుల అమ్మకానికి ఉచితంగా వసతి కల్పించాలి. రైతు బజారులో కుమ్మర.వృత్తి ఉత్పత్తులు అమ్ముకోవడానికి స్థలం కేటాయించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యము కలిపించిమార్కెట్లో విధించేపన్నులనుండి మినహాయింపు ఇవ్వాలి.

### కుమ్మర్లను బి "సి"ఏ"గ్రూపులో చేర్చాలి.

ప్రభుత్వం కుమ్మర్లు సామాజికంగా విద్యా ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందడానికి విద్యా ఉపాధి రంగాల్లో పోటీని ఎదుర్కోవటానికి "కుమ్మర కులాన్ని" బిసి ఏ"గ్రూపులో చేర్చాలి.

### ఇన్సూరెన్స్ పథకాలు

కేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్ 'ఆరోగ్య బీమా సౌకర్యం కుమ్మర వృత్తి కార్మికులకు వర్తింప చెయ్యాలి .కుమ్మర వృత్తి కార్మికులను కార్మిక మంత్రిత్వ శాఖ లేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా అందించాలి.

### వృద్ధాప్య పెన్షన్ సౌకర్యం

50 యేళ్లు దాటిన కుమ్మర వృత్తి దారునికి వృద్ధాప్య పెన్షన్ సౌకర్యం వర్తింప చెయ్యాలి.

### శిక్షణా కేంద్రాలు ఉచిత భూమి కెటాయింపు

జిల్లా మండల కేంద్రములో "పాటరీ ఉత్పత్తులు శిక్షణ కేంద్రాలను" నెలకొల్పటానికి ప్రభుత్వం 10 ఎకరాల భూమినీ ఉచితంగా కేటాయించాలి. ఆధునిక పాటరీ పింగాణీ పరిశ్రమల స్థాపన లో కుమ్మర వృత్తి దారులకు 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి కుమ్మర వృత్తి దారులను కుమ్మర యువతను ఔత్సాహిక పారిశ్రామిక ఉధ్యమిత్వ నైపుణ్యాన్ని పెంపొందించే అభివృధి వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేయాలి.

గ్రామ దేవతలు పూజారులు

గ్రామదేవాలయలలో( గ్రామ దేవతల గుడిలో పోషమ్మ 'మైసమ్మ) కుమ్మరను పూజారులుగా నియమించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలి.

### ఉచిత విద్యుత్తు ఉచిత విద్యుత్తు చక్రం

ప్రతి కుమ్మరి కుటుంబానికి ఉచిత విద్యుత్తు తో పాటు కుండలు చేసే విద్యుత్తు చక్రాన్ని ఉచితంగా అందించాలి. ప్రమాద బీమా సౌకర్యం కలిపించాలి.

### వడ్డీలేని రుణాలు ఇవ్వాలి

కుమ్మర వృత్తి దారులు ఏర్పాటు చేసుకున్న ప్రాథమిక సహకార సంఘాలకు వడ్డీలేనిరుణాలు అందించి వ్యాపార 'వాణిజ్య పరంగా అభివృధి చెందే విధంగా ప్రభుత్వం సంస్తాగత రుణాలు అందించాలి. స్వల్ప కాలిక పెట్టుబడులను సమకూర్చి కుమ్మర వృత్తి దారులకు ఆర్థిక భద్రత కు స్వావలంబన కొరకు కృషి చెయ్యాలి.

### ఫైనాన్స్ కార్పొరేషన్

ప్రభుత్వం కుమ్మర ఫైనాన్స్ కార్పొరేషన్ నెలకొల్పి కుమ్మర వృత్తి దారులకు సబ్సిడీరుణాలు ఇవ్వాలి.

కుమ్మర శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్‌కు పాలకమండలి చైర్మన్ నునియమించి వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కార్యాచరణను అమలు చేయాలి.

### రాష్ట్ర స్థాయిలో పాటరీ టెర్రకోట ప్రదర్శన

రాష్ట్ర స్థాయిలో మట్టిపాత్రల టెర్రకోట ప్రదర్శన శాల (ఎగ్జిబిషన్) ఏరాటుకు ప్రభుత్వం పూనుకోవాలి. చేనేత వస్త్రాల మార్కెటింగ్ "కోఆప్ టెక్స్"ఉన్నట్లు పాటరీ టెర్రకోట కోట మట్టి ఉత్పత్తులు మార్కెటింగ్ గారెంటి కొరకు "పాటరీ ఆప్టెక్స్" లాంటి సంస్థను స్థాపించి కుమ్మర వృత్తిదారుల ఆదుకోవాలి.

### ప్రభుత్వం కుమ్మర్లవృత్తి ఉత్పత్తుల ఆదరణ

కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషనులో అమ్మే టీ స్టాళ్ళలో మట్టి కప్పులనే వాడలనే ఉత్తర్వు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చెయ్యాలి .కుమ్మర్ల మట్టి ఉత్పత్తులను జాడిలను కుండలను పూలతొట్టిలను ప్రభుత్వ ఆఫీసుల్లో నీటి నిలువ చేసుకోవటానికి రంజన్‌లను ప్రభుత్వం నిర్వహించే మొక్కల పెంపకం కొరకు నర్సరీల్లో కుమ్మర్లు తయారు చేసిన జాడీలు వాడేట్లు ఉత్తర్వులు జారీ చెయ్యాలి.

కుమ్మర వృత్తి పునరుద్దరణ అంటే సనాతన సాంప్రదాయ సంస్కృతి నాగరికత ను పునరుద్ధరించుకోవడమే పాటరీ కోర్సు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం నూతన విద్యా విధానంలోయూనివర్సిటీలలోఆధునిక పాటరి 'టెర్రకోట ' పింగాణిమ్యాన్ ఫ్యాక్చరింగ్ నుపాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి.

### కుమ్మర వృత్తి ప్రత్యేక ప్యాకేజీ

ఖాదీ గ్రామీణ పరిశ్రమ కమిషన్ కుమ్మర వృత్తిని కుటీర పరిశ్రమగా గుర్తించాలి. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ చిన్న లఘుకుటీర పరిశ్రమ శాఖ కుమ్మర వృత్తి అభివృద్ధి విస్తరణ వికాసానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రవేశ పెట్టాలి.

### ఖాదీ కమీషన్ కుమ్మర వృత్తి దారులకు ప్రాతినిధ్యం

జాతీయం స్థాయిలో 'రాష్ట్ర స్థాయిలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ పాలక వర్గంలో "కుమ్మర వృత్తి దారులకు డైరెక్టర్లుగా "ప్రాతినిధ్యం కల్పించాలి . కుమ్మర వృత్తి పరమైన ఉత్పత్తులకు' అభివృద్ధికి విస్తరణకు మార్కెటింగ్ మొన్నగు విధానాల రూపకల్పనలో కుమ్మర వృత్తి దారులను భాగస్వాములను చెయ్యాలి. కుమ్మర వృత్తి దార్లు నివసించే ప్రదేశాలను" క్లస్టర్స్ గా" గుర్తించి ఆధునిక పాటరీ అభివృద్ధికి కావలసిన మౌలిక వసతులు కల్పించాలి. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణా సౌకర్యాలు కల్పించాలి.

కుమ్మర వృత్తి దారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టి కుమ్మర వృత్తి దారుల ఆర్థికభివృదికి చేయూత నివ్వాలి.

నూతన విధ్యా విధానములో వృత్తి విద్యా కోర్సలలో పాటరి డిజైన్ అనే పాఠ్యాంశాన్ని ప్రవేశ పెట్టాలి.

### పాటరీ ఫైన్ ఆర్ట్స్

పాటరీ కోర్స్ ఫైన్ ఆర్ట్స్ కోర్సల్లో చేర్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

### పాటరీ పరిశోధన బడ్జెట్

యూనివర్సిటీ స్థాయిలో పాటరీ ఆధునికీకరణ శిక్షణ పరిశోధన

కొరకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి ప్రభుత్వం బడ్జెట్లో కుమ్మర వృత్తి ఉత్పత్తుల కొరకు నిదులు కెటాయించాలి. మానవ నాగరికత చరిత్ర నిర్ధారణకు ఉపయోగపడే కుమ్మరవృత్తి ఉత్పత్తులప్రోత్సాహక సంరక్షణచర్యలు ప్రభుత్వాలు చేపట్టాలి. రాజకీయ ప్రాతినిధ్యం కుమర్లు జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో కుమ్మర్లకు ప్రాతినిధ్యం కలిపించాలి.

నామినేటెడ్ పదువుల్లో కుమ్మర్లను నియమించి రాజకీయ ప్రాతనిధ్యం కలిపించాలి. కుమ్మర మేధావులు రచయితలైన మొల్ల' వరకవి సిద్దప్ప ఎపి ఉమ్మడి హైకోర్టు మాజీ చీఫ్. జస్టిస్ 'కీర్తి 'శే 'నాంపెల్లి జస్టిస్ కుమారయ్య తొలి తరం కుమ్మర సంఘం నాయకులు కీర్తి' శే 'టి అంజయ్య 'జాలిగామ ఈశ్వరయ్య వారి చరిత్రను భవిష్యత్ తరాలకు అందంచేస్తూ హైదరాబాద్ మరియు ముఖ్యనగరాలమధ్య కూడళ్లలో వారి విగ్రహాలను నెలకొల్పి ప్రభుత్వ సంస్థలకు వారి పేర్లు పెట్టల్సిన అవసరం ఎంతైనా వుంది.

### అధ్యయన కమిటీ

ప్రభుత్వం' కుమ్మర సామాజిక వర్గాన్ని గుర్తించి కుమ్మరుల జీవన పరిస్థితుల పట్ల అధ్యయన కమిటీ వేసి వారి యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ పరిస్థితులకు అధ్యయనం చేయాలి .

కుమ్మర వృత్తి దారుల హక్కుల రక్షణకు మెరుగైన జీవన భద్రతకు ప్రభుత్వంతో పాటు కుమ్మర కుల సంఘాలు రాజకీయాలకు అతీతంగా కుమ్మర వృత్తి దారులు సంక్షేమమే ధ్యేయంగా స్వచ్ఛందంగా కృషి చెయ్యాలి.

కుమ్మర కుల వృత్తిపునర్జీవనముతో ఆర్థిక వ్యవస్థ ప్రగతి పథంలో పురోగమించేలా ప్రభుత్వాలు సమగ్రమైన కార్యాచరణతో సూక్ష్మ స్థూల స్థాయి 'ప్రణాళికలను అమలు చేసి కుమ్మర వృత్తి దారుల జీవితాలలో నూతన వెలుగులు నింపాలని ఆశిద్దాం



-నేదునూరి కనకయ్య
9440245771

# జక్కాపూర్ బాల సాహిత్యం జయహో !







## (వివిధ పత్రికల్లో 60 కథలు ప్రచురితమైన సందర్భంగా )

బాలల ఉజ్వల భవిష్యత్తు కోసము బంగారు బాటలు వేసేది బాల సాహిత్యము. బాలల కోసం రచనలు కొంతమంది చేస్తారు. మరికొంత మంది బాలల చేత రచనలు వ్రాయిస్తారు. ఇంకొంత మంది తాము బాలల కథలు వ్రాస్తూ, బాలల చేత కథలు, కవితలు, గేయాలు వ్రాయిస్తూ బాలల సృజనాత్మకత కు అక్షర రూపం కల్పించి సాహితి లోకానికి పరిచయం చేస్తారు. అలాంటి వారే భైతి దుర్గయ్య గారు.

ఈరోజు బాల సాహిత్యంలో సిద్దిపేట జిల్లా జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేకత ఉన్నది. అందుకు కారణం అక్కడి పాఠశాల లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య మార్గదర్శనంలో విద్యార్థులు కథలు, కవితలు, చిత్రలేఖనము లాంటి సాహిత్య విషయాల్లో విశేష ప్రతిభ కనబర్చడమే అని చెప్పవచ్చు.

2019 మార్చ్ లో ఈ పాఠశాల విద్యార్థులు వ్రాసిన 32 కథలతో "జక్కాపూర్ బడి పిల్లల కథలు" పుస్తకం ఆవిష్కరించబడింది. నాలుగు నెలల్లోనే ఆగస్టు లో రెండవ ముద్రణ చేసుకుని, 1300 పుస్తకాలు కొనుగోలు జరిగి బాల సాహిత్యం లోనే ఒక సంచలనం సృష్టించినది. ఇందులో మంచిపుస్తకం ద్వారా బహుమతి పొందిన ఆరు కథలున్నాయి. ఈ పుస్తకం ఎంతోమందికి ప్రేరణగా నిలిచింది. ప్రముఖ బాల సాహిత్య వేత్తల ప్రశంసలు పొందిన ఈ పుస్తకానికి అమెరికా లో కూడా ఆదరణ లభించింది.

మార్చ్ 2020 లో ఇదే పాఠశాల విద్యార్థులు వ్రాసిన 74 కవితలతో " మధుర పద్మాలు " అనే పుస్తకం ఆవిష్కరించబడింది. ఇందులోని 53 కవితలు నేటినిజం పత్రికలో మరియు ఇంకొన్ని వివిధ పత్రికల్లో ప్రచురించ బడినవి.

అక్టోబరు 2022 లో ఈ పాఠశాల విద్యార్థులు వేసిన 120 బొమ్మలతో "జక్కాపూర్ జక్కనలు " అనే 52 పేజీల రంగుల చిత్రలేఖన పుస్తకమును ఆవిష్కరించారు. ఈ చిత్రాలు అన్ని పత్రికల్లో ప్రచురించినవి కావడం విశేషము. ఒక ఈనాడు హాయ్ బుజ్జీలోనే 101 చిత్రాలు ప్రచురితమైనవి. ఈ మూడు పుస్తకముల కు భైతి దుర్గయ్య సంపాదకులు కాగా, విద్యార్థుల సాహిత్య అభిరుచిని మెచ్చి, మొసర్ల మాధవ రెడ్డి (అమెరికా ),తోట మధుసూదన్,తోరటి రఘురంజన్,మేరెడ్డి రవిప్రకాష్ లాంటి సాహిత్యాభిలాషులు ఆర్థిక చేయూత నివ్వడం సంతోషకరమైన విషయం.


అక్టోబర్ 2020 నుండి డిసెంబర్ 2022 వరకు గల 27 నెలల సమయం లో ఈ పాఠశాల విద్యార్థులు వ్రాసిన 50 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమైనవి. ఇందులో 12 కథలకు రాష్ట్ర ,జాతీయ స్థాయిలో బహుమతులు కూడా పొందినవి.



భైతి దుర్గయ్య

ఈనాడు హాయ్ బుజ్జీ -1, వార్త మొగ్గ -1, సోపతి-1,నేటి నిజం-11,ప్రజా మంటలు-16, నమస్తే తెలంగాణ అల్లరి- 6, చెకుముకి-4,సహరి-2,ప్రజాశక్తి చిన్నారి-4 ,గడుగ్గాయ్ -3, మొలక మాస పత్రిక -2, మయూఖ -2 ,నిత్య-1,మహిళా మార్గం -1,గణేష్ -1,బాల మందారాలు -2,పలక -1,ఉపాధ్యాయ దర్శిని -1 లాంటి పత్రికల్లో ఈ కథలు ప్రచురితమయ్యాయి.

కయ్యాల అక్షయ -4,మట్టే ప్రసన్న -3,రాగటి మేఘన -2,దుబ్బాక రాకేష్ -1,గూడెపు సౌమ్య -1,పురుమాండ్ల హారిక-2,బొప్ప సాత్విక -1,కయ్యాల దీప్తి -5,బచ్చుపల్లి శ్రీనిధి -1,మట్టే తేజస్విని -4,కయ్యాల నిఖిత -2,సారుగు శ్రీజ -6,ఈర్ల సౌమ్య -3,పర్స మౌనిక -1,వెన్నెల అమూల్య -1,కొంపల్లి విశిష్ట -4, సరస్వతి అనూజ -1,చింతల అన్వేష్ -1,తాటిపల్లి భువనేశ్ -1,బుస్సవేని రిషిత -2,బెజగామ సాత్విక -2, తీగల సాత్విక -1,సిరిసిల్ల జశ్వంత్ -1,మల్లు గారి రేష్మ -3,పల్లె వైష్ణవి -2,కందుకూరి సాయి చరణ్ -1,జక్కిరెడ్డి రీచా -1,మిద్దె గణేష్ -1,కొంగరి అభిషేక్ -1,దాసరి ప్రసన్న కుమార్ -1 కథ , ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల విద్యార్థులు ఈ కథలు వ్రాసారు.




### బాల కథకుల వ్యక్తిగత అభిప్రాయములు

నేను వ్రాసిన నాలుగు కథలు,పది కవితలు ప్రచురితమైనవి. ఉపాధ్యాయ దర్శిని పత్రిక నిర్వహించిన బాలల కథల పోటీలో నేను వ్రాసిన " మానవత్వం లేని మనుషులు " కథ వేయి రూపాయల నగదు బహుమతి గెలుచుకుంది. అలాగే నేను వ్రాసిన కవిత కు తెలంగాణా సారస్వత పరిషత్తు వారు కూడా వేయి రూపాయల నగదు బహుమతి వచ్చింది. దుర్గయ్య సర్ కథలు వ్రాసేలా మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చారు.

**-కయ్యాల అక్షయ**

సిద్దిపేట సుగుణ సాహితి సమితి నిర్వహించిన కథల పోటీల్లో వరుసగా 2020,2021 రెండు సంవత్సరాలలో ప్రత్యేక బహుమతి రావడం ఆనందాన్ని కలిగించింది. నేను వ్రాసిన బాల చెలిమి పుస్తక సమీక్ష ను పెద్దపెద్ద వారు మెచ్చుకున్నారు. నా కథలు నేటి నిజం పత్రికలో ప్రచురితమయ్యాయి.

**-మట్టే ప్రసన్న**

ఇప్పటి వరకు నేను వ్రాసిన ఆరు కథలన్నీ ప్రచురితమైనవి. నేను వ్రాసిన "కూతురు" కథను చాలా మంది మెచ్చుకున్నారు. సుగుణ సాహితి కథల పోటీలో ఐదు వందల రూపాయల బహుమతి రావడంతో నాకు చాలా సంతోషంగా ఉంది. బాలల దినోత్సవం సందర్భంగా నేను వ్రాసిన" బంగారు మొక్క" కథ సహరి పత్రికలో ప్రచురితమయ్యాయి.

**- సారుగు శ్రీజ**

నేను వ్రాసిన" రైతు గొప్పదనం" అనే కథ పెందోట రాష్ట్ర స్థాయి కథలపోటీలో ప్రథమ బహుమతిగా వేయి రూపాయల నగదు లభించింది. మా డీఈవో గారి చేతుల మీదుగా బహుమతి తీసుకోవడం జీవితంలో మరచిపోలేను.

**-మల్లు గారి రేష్మ**

"హ్యాండ్ శాని టైజర్ " అనే కథ ను కరోనా గురించి వ్రాసాను. చెన్నయ్ తెలుగు వెలుగు సంక్షేమ సంఘం వారు నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో ఈ కథ కు ప్రత్యేక బహుమతి వచ్చింది. ఈ బహుమతి రావడం వల్ల రెండు రాష్ట్రాల రచయితలు నాలుగు వేల విలువైన తమ పుస్తకాలను పంపించారు. వారందరికీ కృతజ్ఞతలు.

**-కయ్యాల నిఖిత**

నేను నాలుగు కథలు వ్రాసాను. బొమ్మకు తగిన కథలు కూడా వ్రాసాను. చెకుముకి పత్రికలో ఇలాంటివి రెండు కథలు ప్రచురితమైనవి రైతుల గురించి నేను. ఇంకా కథలు వ్రాస్తాను.

**-కొంపల్లి విశిష్ట**

నేను వ్రాసిన "కష్టం విలువ" అనే కథ కు మూడు వందల రూపాయల బహుమతి వచ్చింది. అందుకు నాకు చాలా ఆనందంగా ఉన్నది.

**-తాటిపల్లి భువనేశ్**



-వేల్పుల రాజు
సెల్: 9701933704

# తిరుపతి వెంకటకవులు అవధాన విద్యా ప్రావీణ్యులు



నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతిశర్మ, కళా జనార్ధనమూర్తి, రమణ వెలమకన్ని తదితరులు

తిరుపతి వెంకటకవులు అవధాన విద్యా ప్రావీణ్యులని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి వెంకటకవుల్లో ఒకరైన దివాకర్ల తిరుపతి శాస్త్రి జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగమారుతిశర్మ మాట్లాడుతూ చెళ్లపిళ్ల వెంకశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రి తిరుపతి వెంకటకవులుగా ప్రసిద్ధులన్నారు. ఎందరో మహానుభావులు పేరిట చరిత్రలో ప్రసిద్ధులైన మహనీయుల జయంతులు జరుపుతూ వారిని సజీవంగా నిలుపుతున్నారని గానసభ నిర్వాహకులను అభినందించారు. సాహితీవేత్త రమణ వెలమకన్ని మాట్లాడుతూ ప్రసిద్ధి పొందిన కృష్ణరాయబారంలోని పద్యాలు తిరుపతి కవుల పాండవోద్యోగ విజయాలు కావ్య నాటకంలోనివేనని గుర్తు చేశారు. తిరుపతిశాస్త్రి తక్కువ వయస్సులోనే మరణించినా వెంకటశాస్త్రి తదనంతర కాలరచనలను తిరుపతి వెంకట కవులు పేరుతోనే వెలువడటం వారి మైత్రీ బంధానికి నిదర్శనమని అన్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్‌బీ.రామ్, పురాణం పండ శ్రీనివాస్ రామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# స్నేహ ధర్మం

(కథ)

ఒక పెద్ద అడవి. అందులో అనేక రకాల జంతువులను నివసిస్తున్నాయి. కుందేల్లు చాలా ఉన్నాయి. తెల్లగా బొద్దుగా చెంగుచెంగున ఎగురుతుంటాయి. రెండు కుందేల్లు ఎటు పోయిన కలిసిపోయేవి.

కలిసి కబుర్లు చెప్పుకునేవి. కలిసి ఆడుకునేవి.

ఒకరోజు ఒక కుందేలు ఆహారం తింటూ వలలో చిక్కుకుంది. వేటగాళ్లు కుందేల్లు పడతారు అని మిత్రుని మాటలు గుర్తుకు వచ్చాయి. భయం గా ఏడుస్తూ అటు ఇటు కదులుతుంది.

తన మిత్రుడు ఎంతకు ఇంటికి రాకపోవడంతో అటు ఇటు చూస్తుంది. ఉదయం పోయిన వాడు త్వరగా ఇంటికి రావాలి కదా. ఎండ కూడా బాగా అయింది. సూర్యుడు నడి నెత్తిమీదికి వచ్చాడు. ఏదైనా ఆపద రాలేదు కదా అంటూ కుందేలు ఆలోచించ సాగింది.

మిత్రమా! ఎక్కడ ఉన్నావు అంటూ అరుస్తూ అటు ఇటు పరుగులు తీసింది. దూరంగా ఒక చెట్టు కింద ఏడుస్తున్న కుందేలు కనబడింది. పరుగున దగ్గరకి రాబోయింది. ఆగు మిత్రమా అక్కడే ఆగు. నేను ఇప్పుడు వలలో చిక్కుకున్నాను. నన్ను తాకితే నీవు కూడా వలలో పడతావు అని ఏడుస్తూనే అంది.

అయ్యో ఎంత పని అయింది అంటూ బయట ఉన్న కుందేలు అంది. మిత్రమా ఇప్పుడు నువ్వు చేసేది ఏడుపు కాదు. దేవుడు నాకు ఇంతే రాసినట్లు ఉంది. అదిగో వేటగాళ్లు వస్తారేమో పోయి నీవైనా సుఖంగా ఉండు అంది లోపలి కిందేలు.

నీ ప్రమాదం నాది కాదా పోతే ఇద్దరం పోదాం. లేదా ఇద్దరం ఆపద నుండి బయటపడదాం.

మనవలలో కుందేలు పడిందిరా. లోపల ఒకటి బయట ఒకటి ఉన్నాయి. అయినా మనల్ని చూసి పారిపోవాలి కదరా బయటది అన్నాడు వేటగాడు మరొకరితో. అవున్రా దీనికి ప్రాణం మీద తీపి లేదేమో లేదా మంచి స్నేహితులు, అన్నదమ్ములు అయి ఉంటాయి మనలా అన్నాడు మరొక వేటగాడు.

ఆగు మానవ వీడు నా స్నేహితుడు. మేము మేము కలిసి ఆడుకుంటాం. కలిసి తింటాం. కలిసి పాడుకుంటాం. కలిసి మీకు దొరుకుతాం. అన్నది బయటకుందేలు.


ఆగు మానవా వాడి మాటలు వినకు. వాడు నా స్నేహితుడే అయినా నేను నీ వలలో చిక్కుకున్నాను. కాబట్టి నన్ను తీసుకొని పొమ్ము. వాడిని వదిలిపెట్టుము అన్నది లోపకుందేలు.

మీరు మా పిల్లల స్నేహాన్ని గుర్తు చేశారు అంటూ మెల్లగా వాళ్ళ వలను తీశారు. పొండి పోయి ఆడుకోకండి అని వదిలిపెట్టారు. మనసున్న మంచి వేటగాళ్లు.



-పెందోట వెంకటేశ్వర్లు,
9440524546.


# ఘనంగా సుప్పని పుస్తకాల ఆవిష్కరణ




మార్చి 20న స్థానక శ్రీరాం నారాయణ్ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల-బాన్సువాడ మరియు భీమన్న సాహితీ పీఠము బాన్సువాడ సంయుక్త ఆధ్వర్యంలో సుప్పని సత్యనారాయణ రచించిన పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఆయన రచించిన 'సుప్పని శతకము, డా॥ అయాచితం నటేశ్వర శర్మ చేతులమీదుగా మరొక పుస్తకం కళాశాల ప్రిన్సిపాల్ డా॥ గంగాధర్ ఇందూరుగారు ఆవిష్కరించారు. ఇదిలా ఉండగా డా॥ బోచ్కర్ ఓం ప్రకాష్ సుప్పని శతకము గ్రంథ సమీక్ష చేయగా, డా॥ కాసర్ల నరేష్‌రావు 'సిరా సమీరం'పై సమీక్ష చేసారు. ఈ కార్యక్రమముకు ఆత్మీయ అథితులుగా హాజరైన డా॥ వామనమూర్తి, శ్రీయుత వేంకటరావు దీక్షిత్, సూరారంశంకర్, డా॥ తుకారం తమ ప్రతి స్పందనను తెలియజేసారు. డా॥ ఎర్రా రాం భాస్కర్‌రాజు అందించిన కార్యక్రమ వ్యాఖ్యాన. సభికులను ఆకట్టుకుంది. గ్రంథ రచయిత సుప్పని ఈ కావ్యాలను తన తల్లిదండ్రులకు అంకితం చేసారు. తల్లిదండ్రులతో సమానమగు స్వర్గీయ గోషిక నరహరిగారి సతీమణి గోశిక లక్ష్మి- అంకితార్పణలో భాగస్వామ్యం. అలాగే రచయిత స్పందనలో భాగంగా సుప్పని తన కావ్య రచనలో సహకరించిన ఎందరో మహానుభావులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగ పర్యంతమయ్యారు. స్థానిక గెజిటెడ్ అధికారుల సంఘం సభికులందరికీ పుస్తకావిష్కరణ విందును ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన బోధనేతర సిబ్బంది ఆత్మీయులు, పుర ప్రముఖులు, పాత్రికేయులు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందన సమర్పణతో సభ విజయవంతమైంది.

పుస్తక సమీక్ష

# సహృదయ సమీక్షలతో వెలుగుల వెల్లువ...!






నాలుగు దశాబ్దాల కాలంగా సాహితీ యానం చేస్తున్న అన్నాడి గజేందర్ రెడ్డి గారు వృత్తిరీత్యా విశ్రాంత ప్రధానాచార్యులు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన అనుభవమున్న ఆయన ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేశారు.. ప్రవృత్తిపరంగా అవిశ్రాంతంగా సాహితీసేవలో తరిస్తున్నారు.. వక్తగా, గాయకునిగా ఆయన అందరి ప్రశంసలనందుకుంటున్నారు.. అధ్యయన శీలి.. నిరంతరంగా సాహితీసేద్యం చేస్తున్నప్పటికీ.. ఇప్పుడిప్పుడే తమ మొదటి గ్రంథంగా "వెలుగుల వెల్లువ" పేరుతో కవిత్వ వ్యాసాలను మనకందించారు. అనేక సాహితీ ప్రక్రియలపై అవగాహన ఉన్న ఆయన.. వివిధ గ్రంథాలను క్షుణ్ణంగా చదివి వాటిని పరిచయం చేస్తూ గత కొద్దికాలంగా పత్రికలకు సమీక్షలు

**ఇప్పుడిప్పుడే తమ మొదటి గ్రంథంగా "వెలుగుల వెల్లువ" పేరుతో కవిత్వ వ్యాసాలను మనకందించారు.**

రాసి పంపడాన్ని చూస్తున్నాం.. వివిధ ప్రక్రియలతో పాటు కవిత్వ సంబంధ పుస్తకాలపై తాను రాసిన వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురణ అయ్యాయి.. ఇప్పుడు కవిత్వ సంబంధ వ్యాసాలను ఏర్చి కూర్చి "వెలుగుల వెల్లువ"ను వెలువరించారు.

"వెలుగుల వెల్లువ"లోని ప్రతి వ్యాసం.. సాహితీ విలువలతో రూపుదిద్దుకుంది. సమీక్ష, విమర్శ వంటి అంశాలపై ఓ అవగాహన ఉన్న ఆయన.. సహృదయంతో.. కవిత్వ గ్రంథాలను పరిచయం చేస్తూ.. సమీక్షలు రాసిన వాటినే ఇందులో పొందు పరిచారు. వీటిని సమీక్షలుగానే కాక... గ్రంథ పరిచయాలుగా.. విమర్శా వ్యాసాలుగా చూసేందుకు యోగ్యమైన రచనలను గ్రంథస్థం చేశారు. గజేందర్ రెడ్డి గారి సునిశిత పరిశీలన.. పరిశోధనా పటిమకు అద్దంపట్టే విధంగా ఇందలి వ్యాసాలు కొలువు దీరాయి.

సమీక్ష.. గ్రంథ పరిచయం.. పుస్తకాన్ని బట్టి రచనను బట్టి కొనసాగించడంలో రెడ్డిగారు కృతకృత్యులయ్యారు. కవి పేరును బట్టి... హోదాను బట్టి.. అనుభవాన్ని బట్టి కాకుండా పారదర్శకంగా.. నిస్పక్షపాతంగా రచనను పరిశీలించి రాసిన వ్యాసాలే ఎక్కువ ఇందులో ఉండటం విశేషం.. అక్కడక్కడ సందర్భోచితంగా సున్నితంగా సలహాలు.. సూచనలు యిచ్చిన వ్యాసాలు కొన్ని మనకు ఇందులో కానవస్తాయి.

ప్రముఖ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి గారు పేర్కొన్నట్టు.. సమీక్షించే గ్రంథాన్ని సమగ్రంగా చదవడం ఒక ఎత్తు.. చదివి జీర్ణమైన దానిని నిర్మాణాత్మకమైన పద్ధతిలో, నిర్మాణాత్మకమైన భాషలో చెప్పగలగడం మరో ఎత్తు.. ఈ రెండు ఎత్తులకూ ఎదిగినవారే నమ్మదగిన సమీక్షకులవుతారు. గజేందర్ రెడ్డి గారిలో ఈ గుణం కొంతైనా ఉంది. ఆయన వాక్యాలు ఎక్కడ కుంటవు.. గెంతవు.. గుండె నిబ్బరంతో గంభీరంగా నడుస్తాయి. అధ్యయనంలోని పరిపక్వత.. అభివ్యక్తిలో అక్కడక్కడ తొంగిచూస్తుంది.

గజేందర్ రెడ్డి గారి వ్యాసాల్లో.. నిజాయితీ కానవస్తుంది. ఆయా పుస్తకాల్లోని విశేషాలను.. సుగుణాలను.. వెలికితీసి సంబంధిత గ్రంథకర్తలను ప్రోత్సహించే ఆయన సహృదయతను చూస్తాం.. తులనాత్మకంగా సమీక్షలు చేసే పటిమ రెడ్డిగారిలో ఉందన్న సంగతిని ఈ వ్యాసాల్లో అక్కడక్కడ చూస్తాం. సమీక్షా వ్యాసాల రూపకల్పనలో రెడ్డిగారు గ్రంథంలోని అంశాలకే పెద్దపీట వేశారు. సందర్భోచితంగా తమ పరిశీలనలో వచ్చిన అంశాలను సమన్వయ పరుస్తూ.. విశ్లేషిస్తూ మరింత ప్రతిభావంతంగా వ్యాసాలను తీర్చిదిద్దడంలో ఇంకా చొరవ చూపితే బాగుండునని అనిపించినప్పటికీ.. తాము ఎంపిక చేసుకున్న గ్రంథాల్లోని సారాన్ని సమర్థంగా పాఠకులకు అందజేయడంలో ఆయన సఫలీకృతులైనారు.

ఈ గ్రంథంలో వివిధ కవిత్వ ప్రక్రియలపై రాసిన 33 సమీక్షా వ్యాసాలున్నాయి. ఇవన్నీ వెలుగు(దర్వాజ), నేటినిజం, నవతెలంగాణ, సాహితీకిరణం తదితర సాహితీ పత్రికల్లో ప్రచురింపబడి అందరి మన్ననలు పొందాయి. సింహభాగం వ్యాసాలు "వెలుగు" (దర్వాజ)లో వచ్చినవి అయినవే కావడం విశేషం. ప్రవర్ధమానులు, వర్ధమానుల కవిత్వ గ్రంథాల పరిచయాలు ఇందులో ఉన్నాయి.

సాహిత్య నందనవనంలో "నూరుపూలు" శీర్షికతో రాసిన వ్యాసంలో డా॥ నందిని సిధారెడ్డి గారు రాసిన ముందుమాటలు – పీఠికలకు సంబంధించిన "నూరు పూలు" గ్రంథాన్ని పరిచయం చేశారు.

సంక్షిప్తత, సమగ్రత సిధారెడ్డి గారి వాక్యాల లక్షణమని.. తేల్చి చెప్పారు. ఎక్కడా తేలిపోకుండా, జారిపోకుండా నిత్యం తడితడిగా ప్రాణ వీచికల్తో కవి యాత్ర చేయడం శివారెడ్డికే సాధ్యమైందని అంటూ కె.శివారెడ్డి గారి మూర్తిమత్వాన్ని సిధారెడ్డి గారు ఆవిష్కరించడాన్ని అభినందించారు. "నూరు పూలు" కవిత్వం ఎలా ఉండాలో చెప్పే విజ్ఞాన సర్వస్వమని.. కవిత్వం ఏమి చేస్తుందో చెప్పే వికాస వేదిక అని గజేందర్ రెడ్డి గారు కొనియాడారు.

డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారి రుబాయీలను 'తెలంగాణ రుబాయీలలో 'కవిత్వం' శీర్షికతో రాసిన వ్యాసంలో – నరసింహారెడ్డి గారికి కైతన్నది నిత్య పదార్థమనీ, అందులోనూ హృదయం పొంగి పొరలినపుడు ఆయనకు ఎపుడంటే అప్పుడొస్తుంది రుబాయి అంటూ కొనియాడారు.

బైస దేవదాస్ గారి సంపాదకత్వంలో వెలువడిన "మట్టిమనిషి ధిక్కార స్వరం" కవితా సంకలనాన్ని సమీక్షిస్తూ.. కాళోజీ వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని అతడందించిన విలువలను కవులు తమ కవితల్ని చక్కగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కొంతమంది కవులు రాసిన కవితా పంక్తులను ఉదహరించిన తీరు బాగుంది.

కాళోజీ ఆశయాన్ని గుర్తు చేస్తూ, ఆచరణకు ప్రేరేపించే చక్కని కవితల సమాహారం "మట్టిమనిషి ధిక్కార స్వరం" అంటూ కొనియాడారు.

"ఉపాధ్యాయునికి అక్షరాభిషేకం" శీర్షికతో రాసిన సమీక్షా వ్యాసంలో.. డా॥ నలిమెల భాస్కర్ గారి "సుద్దముక్క" గ్రంథంలోని విశేషాలను ప్రస్తావించారు. 'సుద్దముక్క'లో అడుగడుగునా కవిత్వం.. అణువణువున నవ్యత్వం ఉందని పేర్కొన్నారు. ఈ గ్రంథంలోని ప్రతి వాక్యం.. ఆస్వాదయోగ్యం.. అనుభవైకవేద్యం అంటూ ప్రశంసల జల్లులు కురిపించారు.

వారాల ఆనంద్ గారి 'అక్షరాల చెలిమె'ను పరిచయం చేస్తూ ఆనంద్ గారు గొప్ప భావుకుడు అని మెచ్చుకున్నారు. ఆయన కవితా సౌందర్యం ఆహ్లాదాన్ని కలిగిస్తుందని కొనియాడారు.

దర్భశయనం శ్రీనివాసాచార్య గారి 'బాటసారి పదాలు'లో బాలలకే కాక.. పెద్దలకూ ఉపయోగపడే సుద్దులున్నాయని వివరిస్తూ మరో వ్యాసాన్ని ఇందులో పొందుపరిచారు. దర్భశయనం గారు బాలల కోసం ఇంతకుమించిన మరో కావ్యం రాయాలని అభిలషించారు.

కందుకూరి 'సౌభాగ్యం' శీర్షికతో గజేందర్‌రెడ్డి గారు రాసిన సమీక్షలో.. సౌభాగ్య గారు కందుకూరి శ్రీరాములు గారి కవిత్వాన్ని విశ్లేషించిన తీరుతెన్నులను ప్రస్తావించారు.

'ఆర్ద్రమైన కవిత్వం' శీర్షికతో కవి కందాళై రాఘవాచార్య గారి 'ఏకధార'ను పరిచయం చేస్తూ ఆచార్యుల వారి కలం నుండి ఏకధారగా కవిత్వం ప్రవహిస్తూనే ఉండాలని ఆకాంక్షించారు.

దేవనపల్లి వీణావాణి గారి 'శిలాఫలకం' పై 'చెరగని ముద్ర' శీర్షికతో సమీక్షనందించారు. పదాలు ఎలా ప్రయోగించాలో – ఆమెకు తెలుసు అంటూ కితాబునిచ్చారు.

జింబో రాజేందర్ గారి 'ఒకప్పుడు' కవితా సంపుటిని గురించి గజేందర్ రెడ్డి గారు రాస్తూ చక్కని ముగింపునిచ్చారు. రాజేందర్ జింబో గ్రంథం జ్ఞాపకాల వాటిక; అనుభవాల పేటిక.. ఆలోచనల వాహిక.. కవితలలో సంక్షిప్తత, సమగ్రత అభిలషణీయం.. జింబో భావాలు మనకు అనుసరణీయం అంటూ వ్యాసాన్ని ముగించిన తీరు బాగుంది.

స్తంభంకాడి గంగాధర్ గారు వెలువరించిన 'ఆనందవర్ధనం' గ్రంథాన్ని పరిచయం చేస్తూ.. ఇందులో ప్రతి కవిత ఒక రసగుళిక.. ప్రతి కవితకూ ఒక శైలి.. కొన్ని కవితలలో ప్రతి చరణానికీ ఒక శైలి.. పదాలు కూర్చడంలో, సమాసాలు పేర్చడంలో అందం ఉందని అభినందించారు.

కవి, చిత్రకారుడు కళ్యాణం శ్రీనివాస్ గారు ప్రకటించిన "హృదయం" కవితా సంపుటిని హృదయరాగాలను గజేందర్ రెడ్డిగారు సమీక్ష రూపంలో సమర్పించిన తీరు బాగుంది.

పుస్తకాలే పునాదిరాళ్లు శీర్షికతో రాసిన వ్యాసంలో ఎర్రోజు వేంకటేశ్వర్లు గారి "బ్లాక్‌బోర్డ్" కవితా సంపుటిని విశేషాలను చక్కగా విశ్లేషించారు. గాజోజు నాగభూషణం గారి "ప్రాణదీపం" గ్రంథం ఎప్పటికీ కవితా కాంతుల్ని ప్రసరిస్తూనే ఉంటుందని మరో వ్యాసం ద్వారా అభినందించారు.

స్త్రీవాద కవిత్వానికి అసలు సిసలైన చిరునామా అంటూ సరసిజ గారి 'ఇక మారాల్సింది నువ్వే' గ్రంథాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మార విజయలక్ష్మి గారి 'రెప్పకింది ఉప్పెన'లో ఎక్కువ భావకవిత్వమే ఉందనీ.. ఈ గ్రంథంలోని భావ కవితల్ని ఒక క్రమపద్ధతిలో కూర్చితే ఇదో ప్రణయ కావ్యమవుతుందని వ్యాఖ్యానించారు.

బైస దేవదాస్ గారి సంపాదకత్వంలో వెలువడిన 'అక్షర నివాళి' కవితా సంకలనాన్ని సమీక్షిస్తూ.. కొందరు కవుల.. కొన్ని కవితా పంక్తులను యథాతథంగా ప్రస్తావించారు. కవిత్వంపై కొంత విశ్లేషణ.. మరి కొంత వ్యాఖ్యానం వుంటే బాగుండే దనిపించింది.

మామిడి హరికృష్ణ గారి "ఊరికి పోయిన యాళ్ళ" గ్రంథంపై సమీక్ష రాస్తూ అత్యధికశాతం తెలంగాణ కవితలతో అల్లబడిన కవితలివి అంటూ

**హోదాను బట్టి.. అనుభవాన్ని బట్టి కాకుండా పారదర్శకంగా.. నిస్పక్షపాతంగా రచనను పరిశీలించి రాసిన వ్యాసాలే ఎక్కువ**

పేర్కొన్నారు.

తెలంగాణ పదాలతో భాషాసౌందర్యాన్ని పుణికిపుచ్చుకొని చదువరులకు హాయి గొలిపే విధంగా అన్నవరం దేవేందర్ గారి 'గవాయి' ఉందని అభిప్రాయపడ్డారు.

డా॥ దాశరథుల నర్సయ్యగారి "బోనం బువ్వ" తెలంగాణతనానికి తొవ్వ అని కొనియాడారు. గంప ఉమాపతి గారు రచించిన "సమర్పణ" కావ్యం పాఠకులకు మధురానుభూతిని పంచుకుందని తెలిపారు.

లేదాళ్ల రాజేశ్వరరావు గారు రచించిన "మౌనమూర్తి" కవితా సంపుటి భక్తునికీ భగవంతునికీ అనుసంధానమని పేర్కొన్నారు. అంతేగాక ఇదో ఆధ్యాత్మిక గోపురమని ప్రశంసించారు. లేదాళ్ల రాజేశ్వరరావు గారి భావాలతో ఏకీభవించని వారు సైతం అతని కవితారీతికి అబ్బురపడతారని వ్యాఖ్యానించారు. డా॥ బొద్దుల లక్ష్మయ్యగారి "శ్రీరఘురామా" కృతిని విశ్లేషిస్తూ ఆయన పద్యాలకు ఏకబిగిన చదివించే లక్షణ ముందని తెలిపారు. పాఠకులకు పద్యాల ఊయలలో ఊగినట్లుందని చమత్కరించారు. ఇంకా సామెతలను, పదబంధాలను, పోలికలను జోడిస్తే అతని పద్యాలు మరింత రక్తికడతాయని సూచించారు.

ఆలవర్తి వెంకటసుబ్బారావు గారి "స్వర్ణపుష్పాలు" గ్రంథాన్ని సమీక్షిస్తూ... ఈ గ్రంథంలోని ప్రతి పదమూ, ప్రతి వాక్యమూ పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటాయని కితాబునిచ్చారు.

వడ్డేపల్లి సంధ్యగారి "చిటపట చినుకులు" గ్రంథాన్ని సమీక్షిస్తూ సంధ్యగారి రచనా వైచిత్రిని సోదాహరణంగా వివరిస్తూ కొనియాడారు.

నల్లాలం గాయాలను మాన్పుతుందనీ.. కూకట్ల తిరుపతి గారి 'నల్లాలం పూలు' కవిత్వం జాతికి గాయాలు కాకుండా చూస్తుందని అభినందించారు.

దామరకుంట శంకరయ్య గారు ఉపాధ్యాయుడుగా చదువుల కోవెలలో గులకరాళ్ళను వజ్రాలుగా మార్చగలడు. రచయితగా మంచి గ్రంథాలను రాసి సమాజానికి అందించగలడంటూ.. ఆయన రచించిన "సీతాకోక రెక్కలు" పుస్తకాన్ని పరిచయం చేస్తూ అభిప్రాయపడ్డారు.

డా॥ బి.వి.ఎన్.స్వామి గారి 'కశప' కొత్తగా కథలు రాయాలనుకునేవాళ్లకు కొన్ని మెలకువలు తెలుస్తాయనీ.. పద్యంలో ఒక పదాన్ని శీర్షికగా తీసుకుని దాని చుట్టూ ఓ కథ అల్లడం బాగుందని పేర్కొన్నారు. శతకాలు.. శతకాల్లోని పద్యాలతో పాటు కథలు పంచే ఓ వినూత్న గ్రంథమన్న అర్థం ధ్వనించేలా గజేందర్‌రెడ్డి గారు తమ సమీక్షా వ్యాసాన్ని తీర్చిదిద్దారు.

ఇంకా ఉదారి నారాయణ గారి 'ఆదిలాబాద్ నానీలు', కందుకూరి శ్రీరాములు గారి 'అలుకుపిడుచ', డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మిగారి 'జానకీ రాఘవీయం', గడ్డం శ్యామల గారి 'తూరుపు సింధూరం', ఉదయశ్రీ ప్రభాకర్ గారి 'తింగరోడు' తదితర గ్రంథాలను పరామర్శిస్తూ రాసిన వ్యాసాలు ఇందులో కొలువుదీరాయి.

గజేందర్ రెడ్డిగారి అధ్యయన శీలతను భాషపై, వివిధ ప్రక్రియలపై ఆయన కున్న అవగాహనకు అద్దంపట్టే విధంగా ఈ గ్రంథంలోని రచనలున్నాయి. ఆత్మీయంగా స్పృశిస్తూ చేస్తూ... స్నేహపూరిత పరిచయం చేస్తూ... సహృదయతను ప్రదర్శిస్తూ రాసిన సమీక్షా వ్యాసాలు.. ఆయా గ్రంథాలను చదవాలన్న ఆసక్తిని పాఠకుల్లో పెంపొందించేలా ఉన్నాయి. మున్ముందు గ్రంథాలను సమీక్షించే సమయంలో మరింత లోతైన పరిశీలన చేసి.. తమ పరిశీలనలో వచ్చిన విషయాలను గ్రంథాల్లోని సమాచారంతో సమన్వయ పరుస్తూ.. విశ్లేషిస్తూ రచనల్ని ఇంకా ప్రకాశమానం చేస్తారన్న విశ్వాసముంది.

**ప్రతులకు :**
అన్నాడి గజేందర్ రెడ్డి
8-3-129, భగత్‌నగర్,
కరీంనగర్ – 505 001.
9848894086



**– దాస్యం సేనాధిపతి**
9440525544

## నేను నేనుగా లేని తనం నుంచి...

నా చుట్టూ ఎన్ని వలలో
వలయాలు వలయాలుగా..
వినయశీలి, సహనశీలి,
దయామయి, త్యాగమయి
మాతృమూర్తి, ప్రేమమూర్తి,
అలుపెరుగని అనురాగం
అపురూపమైన కావ్యం
ఆహా!.. ఎన్ని అందమైన ముసుగులో..!

ఆ అద్భుతమైన ముసుగులతో
చుట్టూ బలమైన తాళ్లు పేని
నేసిన, ఎన్నెన్ని వలలో..
వలయాలు వలయాలుగా
బలంగా చుట్టుకుంటూ..
చిక్కుముడులు వేసుకుంటూ..
ఆ వలయంలో దీపపు పురుగులా
భ్రమిస్తూ.. పరిభ్రమిస్తూ.. నేను
భవిష్యత్ పై పిడికెడంత ఆశ
కానీ.. దాని చుట్టూ పేడ పిడకలతో
పిచ్చివాళ్లను చేసి మత్తులో ముంచెత్తే
వేయిపడగల విషనాగు చుట్టుకుంటూ
కాలకూట విషం నాలోకి ఒంపుతూ
పైకి కనిపించని సంకెళ్లు బిగిస్తూ
అనారోగ్యాన్ని చెంకనేసుకు తిరిగే
నేను గొంతు లోపలి మాటలు
పైకి ప్రకటించ లేక
కన్నీటి ఉప్పదనం తో సహవాసం చేస్తూ
నా ఆశల, అవకాశాల
కలల తలుపులు మూసి
తాళం వేసి లోపలే బందీనై ఉన్నా
నేను నేనుగా లేని చట్రంలో
అడవి పూలలా
రాలిపోతున్న 'నేను '.
జీవితపు అగాధపు
లోతుల్లోకి వెళ్లి వచ్చాక
మొహం పగిలి
పాఠాలెన్నో నేర్చుకున్నాక
నా చుట్టూ మొలిచిన
నిలువెత్తు గోడల జాడ తెలిశాక
వెన్నంటే అందమైన వలయాల
స్వరూప స్వభావాలు బద్దలయ్యాక
చుట్టూ ముసిరిన వలయాలను
పొరలు పొరలుగా ఒలిచేసి
మిణుగురు నై
చిమ్మ చీకట్లో రంగులు అద్దుకుని
లోపలి నన్ను పుటం పెట్టుకుని
రెక్కల సవ్వడి చేస్తూ
నన్ను నేను పొదివి పట్టుకున్నా .
ఇప్పుడు..
గాయం ఘనీభవించిన
మనసు పొరల్లో
భయమనే
ఊట చెలిమ ఇంకిపోయింది
హ..హ్హా కాదు, నన్ను అదుపులో
ఉంచలేక పారిపోయింది
నాలాగా నేనుంటున్నా..
పట్టులాంటి నేను కత్తిలా..
మెత్తని నాలుక చురుకు దేరి
లోతైన చూపు పదునెక్కి
కాలగతిని, మనుషుల్ని
ప్రేమిస్తూనే ఘర్షిస్తూన్నా
ఘర్షిస్తూనే ప్రేమిస్తున్నా
విష సమాజంలో పోరాడి ఓడినా
ఓడి పోరాడినా బతకాల్సిందే
నాకు నచ్చినట్లు నేను బతకాల్సిందే




**-వి. శాంతి ప్రబోధ**
9866703223

## నాగన్న పదాలు

తుమ్మడం గ్రహపాటు
పొరపాటు
కరచాలనం చేటు
ఓరి! నాగన్న.

రాతి బొమ్మలకు గుడి
అసుర మూకల గడీ
మానవుల కేల ? సుడి
ఓరి! నాగన్న.

ప్రేమ ప్రేమను పంచు
డబ్బు జబ్బును పెంచు
కసి బంధమును తెంచు
ఓరి! నాగన్న.



**-నెమలికొండ నాగేశ్వర్ రావు**
8688553470

## తేజస్విని

(కథ)

ఎండాకాలం...సాయంత్రం ఆరవుతున్నా సూర్యుడు విశ్రమించనంటున్నాడు. మల్లెలు అప్పుడే అరవిచ్చి సువాసనలు వెదజల్లుతున్నాయి. పరాకుగానే పూలను అల్లి దేవుడి పటాలనలంకరించి, తన జడలో కొన్ని పెటుకుని, దేవుడి ముందు దీపముంచింది జ్యోతి. భర్త ఇంటికి వచ్చేవేళకి మహాలక్ష్మిలా కళకళలాడుతూ ఉండడం ఆమెకు అలవాటైపోయింది.

మధ్యాహ్నం నుండి ఆమె మనసు మనసులో లేదు. ఇందులో తేజుని తప్పుపట్టడానికి ఏమీలేదు. సమస్యకు పరిష్కారం కూడా తేజూయే చెప్పేసింది. బాగా ఆలోచిస్తే అలా చేయడమే మంచిదనిపిస్తుంది తనకు కూడా.

×××

ఇంతలో వీధి గుమ్మం వద్ద రామం చెప్పులు విప్పుతున్నట్లుగా అలికిడి. ముభావంగానే అతనికి ఎదురెళ్ళి అతని చేతిలో బ్యాగందుకుంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే జ్యోతి మొహంలో నవ్వులేకపోవడం అతడు గమనించాడు.

అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన శ్రీవారికి టీ పెడదామని కిచెన్ వైపు అడుగులు వేసింది జ్యోతి...ఇంతలో రామం స్నానం చేసి వచ్చి బాల్కనీలో ఉన్న ఊయలలో కూర్చుని సేదతీరుతున్నాడు.

రెండు కప్పుల్లో టీ తీసుకొచ్చి భర్తకో కప్పిచ్చి తను ఆ పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది.

"ఏం జ్యోతీ...! అలా ఉన్నావేంటి? మళ్ళీ అమ్మాయి ఒక్కతే వచ్చిందా?" అని అడిగాడు రామం.

చెప్పుల స్టాండులో తేజూ చెప్పులు చూసి ఉంటారని అర్థమైంది ఆమెకు. తన మాటే నెగ్గాలనుకునే రామంతో జీవిస్తూ... ఆమె తన ఇష్టాలను మరిచిపోయింది. తన మనసులోని మాటలను చెప్పడం మానేసింది. ఆయన చెప్పిన మాటలకు తలవూపుతూ, అతనికి ఏ లోటూ రానీయకుండా చూడడం అలవాటైపోయిందామెకు. మరి ఇప్పుడు చెప్పక తప్పదు. లేదంటే తేజూ జీవితం నాశనమైపోతుంది. తన జీవితాన్ని తీర్చిదిద్దడం తన బాధ్యత.

"అవునండి ఇంక వెళ్ళనంటే వెళ్ళనంటుంది. అల్లుడుగారికి ఈ మధ్య అనుమానం జబ్బు పట్టుకుందట. ఏ మగవాడితో మాట్లాడినా సంబంధం పెట్టేస్తున్నారట. మాటలతో కాల్చుకుతింటుంటే భరించింది. ఇక ఇప్పుడు కొట్టడం వరకు పోయింది. "

"అవునా? సరే నేను అల్లుడిగారికి సర్దిచెప్తాను గానీ రెండు రోజులయ్యాక పంపేద్దాం."

"లేదండి ఇప్పటి వరకైంది చాలింక. నేను ఎంత మొత్తుకుంటున్నా వినకుండా... మంచి సంబంధం వాళ్ళే అడిగారు అంటూ చక్కగా డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుకుంటున్న అమ్మాయికి పెళ్ళి చేసారు."

"ఏ ఉద్యోగం చేయని, అసలు చదువే సరిగా లేని అబ్బాయిని మంచి గవర్నమెంట్ ఉద్యోగం అంటే నమ్మేసారు. అన్ని దురలవాట్లున్న, బాధ్యత లేని వాడితో నేను కాపురం చేయనని తేజూ ఎంత చెప్పినా వినకుండా

**" నేనింక ఊరుకునేది లేదండి. ఇన్నాళ్లూ మీ కోపానికి భయపడి ఒక్క మాటా ఎదురు చెప్పలేక పోయాను. ఇక ఒక్కగానొక్క అమ్మాయి జీవితం పాడవుతుంటే ఊర్కోను."**

అత్తగారింటికి పంపారు."

"ఊం... జ్యోతీ...! ఇంక ఆపుతావా? పెళ్ళంటూ అయ్యాక, అమ్మాయి భర్తే లోకంగా బతకాలేకానీ... ఇలా విడిపోవడం మంచిది కాదు. నేను తేజూని రెండు రోజులయ్యాక పంపేస్తాను" అన్నాడు రామం కోపంతో కందగడ్డలా మారిన ముఖంతో...

" నేనింక ఊరుకునేది లేదండి. ఇన్నాళ్లూ మీ కోపానికి భయపడి ఒక్క మాటా ఎదురు చెప్పలేక పోయాను. ఇక ఒక్కగానొక్క అమ్మాయి జీవితం పాడవుతుంటే ఊర్కోను." అంది జ్యోతి ధైర్యంగా.

"ఏం జ్యోతి నా మాటకు ఎదురు చెప్పడం ఎక్కడ నేర్చుకున్నావ్?" అన్నారు మరింత గట్టిగా

అయినా జ్యోతి భయపడదలచుకోలేదు. "అవునండి అటువంటి అయోగ్యుడికి భార్యగా ఉండేకంటే నా కూతురుని ఎల్లకాలం నా దగ్గరే ఉంచుకోవడం నాకిష్టం" అంది. ఎప్పుడూ మాట్లాడనంత గట్టిగా.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం రామం వంతైంది.

జ్యోతి అలా ఎదురు తిరగడం అతనూహించలేదు. అతనికిది అవమానంగా తోస్తుంది. తీవ్రంగా కోపం వస్తుంది.

అమ్మానాన్నల మాటలు గట్టిగట్టిగా వినిపించగానే గదిలో నుండి పరిగెత్తుకుని వచ్చింది తేజస్విని.

"నాన్నా! మీరు ఆగండి. నేను అతనితో కాపురం చేయనిక. నేను నా చదువుని కొనసాగించి, నాకిష్టమైన లెక్చరర్ ఉద్యోగం సాధిస్తాను." అంది తల్లి ఇచ్చిన ధైర్యంతో...

"ఏమిటి ఈ ఇద్దరు ఆడవాళ్ళు ఇలా తిరగపడుతున్నారు" అనుకున్న రామం, "సరే మీ ఇష్టమైనట్లుగా అఘోరించండి. ఇక రేపటి నుండి నేను తల దించుకు బతకాలి కాబోలు" అని కోపంగా అని అక్కడి నుండి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. తను మాట్లాడినా ప్రయోజనం ఉండదని గ్రహించాడతడు.

×××

ఆరేళ్ళ సమయం గిర్రున తిరిగింది. భర్తకు విడాకులు ఇచ్చిన తేజస్విని, లెక్చరర్ ఉద్యోగం సంపాదించడమే కాకుండా... ఎంతోమంది అమ్మాయిలను వేరు వేరు ఉద్యాగాలలో చేరేలా తీర్చిదిద్దింది. ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని, ఎందరో స్త్రీల జీవితాలలో వెలుగులు నింపింది. దానికి గాను ఆమెకు సత్కార కార్యక్రమం జరుగు తుంది.

కార్యక్రమానికి అయిష్టంగానే వచ్చిన రామం, అందరూ కూతురిని పొగుడుతుంటే ఉప్పొంగిపోయాడు. ఆమెను మనసులోనే ఆశీర్వదించి ఇంటికి వెళ్ళాడు.


×××

ఇంటి ముందు కూర్చుని భార్యాకూతుర్ల కొరకు ఎదురు చూస్తున్నాడు.

ఇద్దరూ ఇంటికి రాగానే రామం అలా కూర్చుని ఉండడం వారికి ఆశ్చర్యంగా ఉంది. ఇంట్లో అతను యాంత్రికంగా ఉంటున్నారే కానీ, భార్యను, కూతురిని పట్టించుకున్నది లేదు. మాట్లాడింది లేదు. ఈ రోజు ఇలా...

"తేజూ... బంగారు తల్లి! నీ తండ్రిగా నేను ఈ రోజు గర్విస్తున్నాను. చాలా సంతోషం తల్లీ.... ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపావంటే నువ్వు ఎంత శ్రమకోర్చావో కదా. " అన్నాడు మనఃస్ఫూర్తిగా.

తేజూ సంతోషంగా తండ్రి కాళ్ళకు నమస్కరించింది.



**-వెగ్గలం ఉషశ్రీ**
9440370066

## సమయస్ఫూర్తి

(కథ)

స్కూల్ బెల్ ఘన ఘనమంటూ మోగగానే రంగు రంగుల సీతాకోక చిలుకలు పంజరంలో నుండి స్వేచ్ఛగా....ఒక్కసారిగా బయట పడినట్లు స్కూల్ పిల్లలంతా బయటికి వచ్చారు.

రాజేష్ సురేష్ మాట్లాడుకుంటూ ఇంటిదారి పట్టారు. వారిద్దరూ మంచి స్నేహితులు. రాజేష్ కాస్త పెంకి పిల్లవాడు. సురేష్ నెమ్మదస్తుడు.

ఇద్దరూ 8వ తరగతి చదువుతున్నారు. వారు ఉండేది కూడా ఒకే వీధిలోనే.

"ఏరా సురేష్ రేపు ఆదివారం కదా
మా అక్క వాళ్ళ ఊరికి వెళ్లి వద్దామా" అన్నాడు. రాజేష్ . వాళ్ళ అక్కయ్య పక్క ఊర్లోనే ఉంటుంది. నాలుగు కిలోమీటర్ల దూరంలో.... అప్పుడప్పుడు సరదాగా సైకిళ్లపై అక్క వాళ్ళ ఊరికి వెళ్లడం అలవాటే వారికి.

" సరే రాజేష్ అమ్మా నాన్నలను అడిగి చెప్తానురా " అన్నాడు.

మరుసటి రోజు పొద్దున్నే ఇంట్లో చెప్పేసి రాజేష్ వాళ్ళ ఇంటికి వచ్చాడు సురేష్. వీళ్లు బయలుదేరుతుంటే రాజేష్ వాళ్ళ అమ్మ జాగ్రత్తలు చెప్తూ "ఎప్పుడు వెళ్లిన దారిలోనే వెళ్ళండి డొంక దారిలో మాత్రం వెళ్ళకండి అని హెచ్చరించింది".

"సురేష్ ! డొంక దారిలో ఎందుకు వెళ్లొద్దు రా... నేను వెళ్ళినపుడల్లా చెప్తూనే ఉంటుంది అమ్మ" అన్నాడు రాజేష్."

"ఏమోరా... అయినా పెద్ద వాళ్ళు చెప్పినట్టు వినడం మంచిది అన్నాడు సురేష్".

"ఈసారి ఎలాగైనా డొంక దారి నుంచే వెళ్దాము అంటూ డొంక దారిలోకి సైకిల్ కదిలించాడు రాజేష్. చేసేది ఏమీ లేక సురేష్ వెంబడించాడు. దారి అంతా కంకర తేలి.. చెట్లు చేమలతో నిర్మానుష్యంగా ఉంది.

"వద్దన్నా వినకుండా ఈ దారిగుండా
తీసుకువచ్చావు రాజేష్... నాకు భయంగా ఉందిరా" అన్నాడు సురేష్ "భయపడకు రా నేను ఉన్నాను కదా అన్నాడు ఎంతో పెద్దవాడిలా..!

అక్కడక్కడా కొన్ని పళ్ళ చెట్లు ఉన్నాయి . కోసుకుందామంటే వద్దని సురేష్ వారించాడు. ఇంతలో ఒక చెట్టు నిండా మామిడి పళ్ళతో ఉండేసరికి ఆగాడు రాజేష్. పళ్ళు బాగున్నాయ్ రా ఎలాగైనా కోసుకుందాం అని పట్టుబట్టాడు.

అయితే ఆ చెట్టుకు దగ్గరగా చిన్న నీటి మడుగు ఉంది.

చెట్లు ఎక్కడం బాగా అలవాటే కాబట్టి రాజేష్ గబగబా చెట్టు ఎక్కాడు కొన్ని పండ్లను కోసి కింద పడేశాడు

సురేష్ వాటిని తీసి జాగ్రత్త చేసాడు.

రాజేష్ చెట్టు దిగుతుండగా పట్టు తప్పి జారి నీటి మడుగులో పడ్డాడు.

కానీ అది వీరు అనుకున్నట్టుగా నీటి మడుగు కాదు బురద తో నిండిన ఊబి . దానిలో పడితే బయటికి రావడం చాలా కష్టం. నీటిలో అయితే ఈదుకుంటూ రావచ్చు. బురద కాబట్టి కదల లేక లోపలికి మునిగిపోతారు.

సురేష్ కంగారుగా "కాపాడరా కాపాడరా అంటూ" ఏడవసాగాడు. మెల్లి మెల్లిగా మునిగి పోసాగాడు ఊబిలోకి....

రాజేష్ చాలా భయపడిపోయాడు ఏం చేయాలో తోచలేదు. ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించాడు అటు ఇటు చూసినా చెట్టు చేమ తప్ప ఏమీ కనబడలేదు. దుఃఖం తన్నుకు వస్తుంది మళ్ళీ కళ్ళుమూసుకొని ధైర్యం కూడదీసుకుని చేయాలి ఏదో ఒకటి అనుకుంటూ కళ్ళు తెరిచి

"సురేష్ కంగారు పడకు ధైర్యంగా ఉండు ఏదో ఒకటి చేసి నిన్ను కాపాడుకుంటాను" అంటూ వెంటనే చుట్టూ ఉన్న తీగ బారిన చెట్లను

కొన్నిటిని బలం కొద్దీ లాగాడు.. అడవి తీగ చెట్లు కదా బలంగానే ఉన్నాయి.

ఒకదానికొకటి ముడిపెట్టుకుంటూ పొడవుగా చేశాడు ఒకవైపు కొస తన నడుముకి ముడి పెట్టుకుని మరొక కొస రాజేష్ కి అందించాడు

"అరే భయపడకు రా దాన్ని పట్టుకొని పైకి రా నేను లాగు తాను" అని ధైర్యం చెప్పి దూరంగా నిలబడ్డాడు.

అప్పటికే మెడ వరకు మునిగిపోయిన రాజేష్ ఆ తీగ కొస అతి కష్టంగా గట్టిగా పట్టుకుని పైకి రాసాగాడు. కానీ ఆ బలానికి సురేష్ కూడా ఊబి వైపుకి రాసాగాడు.

ఇప్పుడెలా అనుకుంటూ.... వెంటనే మామిడి చెట్టు చుట్టూ జాగ్రత్తగా ఒక రౌండ్ తిరిగి.... అప్పుడు గట్టిగా తీగను పట్టుకున్నాడు సురేష్. రాజేష్ మెల్లగా పైకి వచ్చాడు అతికష్టంగా. సురేష్ హమ్మయ్య అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు. వెంటనే పైకి వచ్చిన రాజేష్.... సురేష్ ని గట్టిగా కౌగిలించుకుని బోరున ఏడ్చాడు .

"సారీ రా... నువ్వు వద్దన్నా వినకుండా ఈ దారి గుండా వచ్చి తప్పు చేశాను. ఇంకొకసారి పెద్దవాళ్ళ మాటను జవదాటను అన్నాడు తలవంచుకుని" . "సరేలే రా నీకు ఏం కాలేదు అదే నాకు సంతోషం పద ఇంటికి వెళ్దాం " అంటూ అక్క వాళ్ళ ఇంటికి వెళ్లకుండానే సైకిళ్లపై మెల్లిగా ఇంటి దారి పట్టారు.

వీళ్ళ అవతారాలు చూసి వాళ్ల తల్లిదండ్రులు బాగా కంగారు పడ్డారు. జరిగిన విషయం తెలుసుకుని రాజేష్ ని మందలించి... సరైన సమయంలో సమయస్ఫూర్తిని పాటించి స్నేహితుడిని కాపాడినందుకు అందరూ సురేష్ ని అభినందించారు.....

చూసారుగా పిల్లలూ అపాయం లో ఉన్నపుడు కంగారుపడకుండా ఆలోచిస్తే ఉపాయం తప్పకుండా దొరుకుతుంది.



**-కళావతి కందగట్ల**
9948263004

## డా॥ వడ్డేపల్లి సంధ్యకు సన్మానం



వడ్డేపల్లి సంధ్యను సత్కరిస్తున్న అతిథులు.

నగరానికి చెందిన రుద్రంగిలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న వడ్డేపల్లి సంధ్య డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆదివారం సిరిసిల్లలో రంగినేని ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.గోపి, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డా॥ పత్తిపాక మోహన్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెస్ డాక్టర్ రఘు, రంగినేని మోహన్‌రావు, చింతకింది శ్రీనివాసరావు చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.

కాగా సంధ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సినారె సినీ గీతాలు – వస్తు శిల్పాలు అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిల్మానాయక్ పర్యవేక్షణలో పీహెచ్‌డి పొందారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రచయిత, రచయిత్రులు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

